



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 336 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | గురువారం 6 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :336 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | THU 6 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## దేవరపల్లిలో జగన్ పర్యటన.. శ్రుతిమించిన శ్రేణుల ఉత్సాహం!

- తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో జగన్ పర్యటన
- వైసీపీ కార్యకర్తల అతి ఉత్సాహంతో తీవ్ర గందరగోళం
- హెలిప్యాడ్ వద్ద బారికేడ్లను తోసుకువచ్చిన శ్రేణులు
- బైక్‌లతో విన్యాసాలు, సైలెన్సర్లు తీసివేసి హంగామా
- కార్యకర్తల తీరుతో తీవ్ర ఇబ్బందులు పడిన స్థానికులు



పెన్ పవర్ డెస్క్:తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లిలో వైసీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా పార్టీ కార్యకర్తలు ప్రదర్శించిన అతి ఉత్సాహం

- మిగతా 2లో

## విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్.. సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష



- విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం
- ప్రభుత్వ వాటాగా రూ.4 లక్షల కోట్లు, ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు
- మూలపేట పోర్టు నుంచి రాజమండ్రి అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి
- ఏఐ డేటా సెంటర్లు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అత్యంత కీలకమైన విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ బృహత్ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ. 9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ సమీక్షా సమావేశంలో వీఈఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు

- మిగతా 2లో

# రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

## కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు

- దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్
- కూటమి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తీవ్ర ఆరోపణలు
- పొగాకుకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన
- వైసీపీ హయాంలో ఉన్న సున్నావడ్డీ, రైతు భరోసా పథకాలు రద్దు చేశారని విమర్శ
- ప్రభుత్వం సిండికేట్లతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తోందని జగన్ ధ్వజం



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుప డ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. "మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ. 289 ధర పలికింది. కొందరు రైతులు రూ. 365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం

- మిగతా 2లో



## వైఫల్యాలకు భయపడొద్దు.. కఠిన మార్గాన్నే ఎంచుకోండి

### అమృత వర్సిటీ స్నాతకోత్సవంలో నారా లోకేశ్

- అమరావతిలోని అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవం
- గౌరవ అతిథిగా మంత్రి నారా లోకేశ్... విద్యార్థులకు దిశానిర్దేశం
- భవిష్యత్ అవకాశాల కోసం ఏపీ విద్యారంగంలో సమూల మార్పులు
- యువత ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని మంత్రి లోకేష్ ఆకాంక్ష
- వైఫల్యాలకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి
- యువత కలల సాకారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

పెన్ పవర్ డెస్క్:ప్రపంచం గతంలో ఎన్నడూ లేనంత వేగంగా మారుతోందని, కృత్రిమ మేధస్సు (ఏఐ), క్వాంటం ఇంజనీరింగ్ వంటి నూతన సాంకేతికతలు సరికొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల

- మిగతా 2లో

## హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ.. 8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు!

- నకిలీ ఎన్ఓసీ పత్రాలను తయారు చేసిన ముఠా గుట్టు రట్టు
- ఇంటర్ బోర్డు అనుమతుల కోసం దొంగ సంతకాలతో నకిలీ ఎన్ఓసీలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' పేరును వాడుకుని కొందరు అక్రమాలకు యత్నించిన తీరు తీవ్ర కలకలం రేపుతోంది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ 'ఫైర్ ఎన్ఓసీ' (చీూజ) పత్రాలను తయారు చేసిన ఒక ముఠా గుట్టు రట్టయింది. ఏకంగా నగరంలోని 8 ప్రముఖ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా గుర్తింపు పొందేందుకు యత్నించడం విద్యాశాఖతో పాటు పోలీసు వర్గాలను

- మిగతా 2లో



## సీఎం విజయ్ తొలి బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట.. పాఠశాల విద్యకే రూ.44,527 కోట్లు



- కామరాజర్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు
- 10 వేల పాఠశాలల్లో సూపర్ క్లీన్ క్యాంపస్ పథకం
- కళాశాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల కోసం రూ.2,000 కోట్లు
- సంక్షేమ పథకాలకు భారీ నిధుల కేటాయింపు
- అదనంగా రూ.16 వేల కోట్ల ఆదాయం రాబట్టడమే లక్ష్యం

- మిగతా 2లో

## దిగొచ్చిన మెటా.. భారత్‌కు క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

- భారత ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పిన మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్
- డీప్‌ఫేక్‌లు, అభ్యంతరకర కంటెంట్ వ్యాప్తిపై చింతిస్తున్నట్లు వెల్లడి
- ప్రధాని మోదీ పోస్ట్ తొలగింపు వ్యవహారంలో కీలక పరిణామం
- తప్పులు జరిగాయని అంగీకారం, సేఫ్ హార్బర్ రక్షణపై కేంద్రం హెచ్చరిక
- ఢిల్లీలో ఐటీ కార్యదర్శితో మెటా ప్రతినిధుల ఉన్నత స్థాయి సమావేశం

- మిగతా 2లో






## ఏఐతో భయపడొద్దు.. భారత్‌కు లాభాలే ఎక్కువ

- భారత్‌లో ఏఐతో ఉద్యోగాల ముప్పు తక్కువేనన్న ప్రపంచ బ్యాంకు
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కేవలం 4.5 శాతం ఉద్యోగాలకే ముప్పు
- 16.2 శాతం ఉద్యోగాల్లో ఉత్పాదకత పెరిగే అవకాశం
- చిన్న, తక్కువ ఖర్చు ఏఐ వ్యవస్థలపైనే దృష్టి పెట్టాలని సూచన
- వైద్యం, విద్య, వ్యవసాయంలో ఏఐతో పెద్ద మార్పులు సాధ్యమని నివేదిక
- విద్యుత్, ఇంటర్నెట్, నైపుణ్యాలపై పెట్టుబడులు అవసరమని సూచన

- మిగతా 2లో

## 20నిమిషాల్లో 7పేలుళ్లు.. దద్దరిల్లిన దుబాయ్



పెన్ పవర్ డెస్క్: వరుస పేలుళ్లతో దుబాయ్ దద్దరిల్లింది. జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో మంగళ వారం రాత్రి భారీ పేలుళ్లు చోటుచేసుకు న్నాయి. కేవలం 20 నిమిషాల్లోనే 7 భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు.

- మిగతా 2లో

## నిరసనల్లో పాల్గొనే యువత పట్ల అత్యంత సహనంతో వ్యవహరించాలి

- హింసను అదుపు చేసే క్రమంలో బలగాలు జాగ్రత్తగా ఉండాలన్న సుప్రీంకోర్టు
- యువత ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరిక
- యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని వ్యాఖ్య

- మిగతా 2లో



## విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్...

- విశాఖలో పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీకి శ్రీకారం
- భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్
- అరిలోవ తోటగరువులో సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణం
- అకాడమీ నమూనా, సౌకర్యాలను పరిశీలించిన మంత్రి
- కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాశాఖ మంత్రి, టీడీపీ నేతలు

- మిగతా 2లో



పెన్ పవర్

గురువారం 6 ఆగస్టు 2026




## వైఎస్ షర్మిల ముందు పెద్ద టాస్క్.. రేసులో ఎక్కడ?

కాంగ్రెస్ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిలకు బిగ్ టాస్క్ భయపెడుతోంది. ఆంధ్రప్రదేశ్ లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయనుంది. పీసీపీ చీఫ్ షర్మిల అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు బరిలో ఉండాలని నేతలకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలపడి పార్టీ ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆమె పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో అక్టోబర్ లేదా నవంబర్ లోపు ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు వేగవంతం చేసింది. ఎన్నికల సన్నాహాలను ప్రారంభించింది. ఏపీలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం మరియు ప్రభుత్వం దృష్టి పెట్టాయి. ఆగస్టు 6న మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులతో కీలక సమావేశం జరగనుంది. అన్ని ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా గ్రామ స్థాయి నుండి బలోపేతంపై దృష్టి పెట్టింది. అన్ని స్థానాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించింది.

**పోటీ చేసేందుకు...**

అయితే కాంగ్రెస్ లో పోటీ చేయడానికి అభ్యర్థులు ఎంత మేరకు దొరుకుతారన్నదే ప్రశ్న. 2014 రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో పూర్తిగా పట్టును కోల్పోయింది. ఓటు బ్యాంకును కూడా కోల్పోయింది. 2014 ఎన్నికల నుంచి ఏ ఎన్నికలు జరిగినా సింగిల్ డిజిట్ ఓట్ల శాతానికే పరిమితమయింది. పార్టీ అధినాయకత్వం ఎన్ని ప్రయోగాలు చేసినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. రఘువీరారెడ్డి ని పీసీసీ చీఫ్ గా మొదలు పెట్టి అనేక మందిని మార్చారు. చివరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ సోదరి వైఎస్ షర్మిలను పార్టీ చీఫ్ గా నియమించారు. అయితే షర్మిలను నియమించినప్పటికీ పార్టీ ఏమాత్రం పుంజుకోలేదు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు మొత్తాన్ని జగన్ ఎగరేసుకుని వెళ్లడంతో ఆ పార్టీ కోలుకునే పరిస్థితి కనిపిచండం లేదు.

**తొలినాళ్లలో జోరుగా జిల్లాలు...**

వైఎస్ షర్మిల కూడా తొలినాళ్లలో కొంత జోరుగా జిల్లాలు పర్యటనలు చేసినప్పటికీ రాను రాను ఆమె ఎక్స్ వేదికగా స్పందించడం, మీడియా సమావేశాలకే పరిమితమయ్యారు. వైఎస్ షర్మిల ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. కానీ అంతకు ముందు కూడా షర్మిల పెద్దగా రాష్ట్రంలో పర్యటించలేదు. ఏదైనా కార్యక్రమం ఉంటే విజయవాడ వచ్చి పాల్గొని వెళుతున్నారు. మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం, జగన్ పై కుటుంబ సమస్యలు ప్రస్తావిస్తుండటాన్ని స్థానిక కాంగ్రెస్ క్యాడర్ నుంచే పెద్దగా మద్దతు ప్రకటించడం లేదు. చంద్రబాబు ప్రభుత్వంపై అప్పుడప్పుడూ విమర్శలు చేస్తున్నా ఎక్కువగా జగన్ పైనే విమర్శలు చేయడాన్ని పార్టీ నేతలే తప్పుపడుతున్నారు. నాయకులు కూడా వైఎస్ షర్మిలకు సహకరిచడం లేదు. కొందరు హైకమాండ్ కు కూడా షర్మిల వైఖరిపై ఫిర్యాదు చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తప్ప తిరిగి నేతలు యాక్టివ్ కారన్నది వాస్తవం. కానీ అది ఎంత దూరముందో ఎవరికీ తెలియదు.

## వైఫల్యాలకు భయపడొద్దు.. కఠిన మార్గాన్నే ఎంచుకోండి

- మొదటి పేజి తరువాయి

మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ భవిష్యత్ అవకాశాలను యువత అందిపుచ్చుకునేలా సిద్ధం చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానాన్ని సమూలంగా మారుస్తున్నామని స్పష్టం చేశారు. అమరావతిలోని అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరుకాగా, మంత్రి లోకేశ్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "యువత కేవలం ఉద్యోగార్థులుగా మిగిలిపోకూడదు, ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలన్నదే మా లక్ష్యం. వారు పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, పరిశోధకులు, నాయకులుగా ఎదగాలి. ఇందుకోసం విశ్వవిద్యాలయాలను, పరిశ్రమలను మరింత దగ్గర చేస్తున్నాం. ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, యువత నేర్చుకోవడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి, నాయకత్వం వహించడానికి అవకాశాలు కల్పిస్తున్నాం" అని వివరించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే అత్యంత ఉత్సాహభరితమైన కాలంలో విద్యార్థులు తమ వృత్తి జీవితాన్ని ప్రారంభిస్తున్నారని, గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఒక గొప్ప ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు.

**వైఫల్యాలను చూసి భయపడొద్దు**

పట్టా పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ, "ఈరోజు మీ ప్రయాణానికి ముగింపు కాదు, ఒక కొత్త ప్రయాణానికి ఆరంభం కావాలి. వైఫల్యాన్ని చూసి ఎప్పుడూ భయపడకండి. వైఫల్యం అంటే మీరు సమర్థులు కాదని కాదు, ప్రయత్నించే ధైర్యం మీకుందని అర్థం. విజయం ఎప్పటికీ ప్రయత్నం విరమించని వారినే వరిస్తుంది. ప్రపంచంలో మార్పు తేగలమనే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి" అని పిలుపునిచ్చారు. ఈ డిగ్రీ కేవలం విద్యార్థులది మాత్రమే కాదని, వారి తల్లిదండ్రుల త్యాగాలు, కుటుంబ సభ్యుల మద్దతు, గురువుల మార్గనిర్దేశం కూడా ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు.

**విలువలతో కూడిన విద్య అమృత ప్రత్యేకత**

అమృత యూనివర్సిటీ అందిస్తున్న విద్యను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. "చాలా విశ్వవిద్యాలయాలు జ్ఞానాన్ని, పట్టాలను అందిస్తాయి. కానీ అమృత యూనివర్సిటీ ఆలోచించడం, నాయకత్వం వహించడం, సేవ చేయడం వంటివి నేర్పుతుంది. విద్య అంటే కేవలం కెరీర్ నిర్మించుకోవడం మాత్రమే కాదు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించినదని ఈ వర్సిటీ విశ్వసిస్తుంది. కరుణ, విలువలతో సమాజానికి సేవ చేయడమే విద్య అంతిమ లక్ష్యమన్న పూజ్యనీయులైన 'అమ్మ' దృక్పథం ఎంతో గొప్పది" అని కొనియాడారు. జ్ఞానం మనకు నైపుణ్యాన్ని, సాంకేతికత శక్తిని ఇస్తే, కరుణ వాటికి ఒక పరమార్థాన్ని ఇస్తుందని, అదే అమృత నేర్పే అత్యున్నత పాఠమని అన్నారు.

**నైపుణ్యంపై దృష్టి సారించండి**

జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే సులువైన మార్గాన్ని కాకుండా, సవాళ్లతో కూడిన కఠినమైన మార్గాన్నే ఎంచుకోవాలని లోకేశ్ యువతకు సూచించారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని ఉదాహరణగా చూపుతూ, "మీరు ఎక్కడ మొదలుపెట్టారన్నది ముఖ్యం కాదు, ఎక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్నారన్నదే ముఖ్యం. విజయం కోసం పరుగులు తీయకుండా, అత్యుత్తమ నైపుణ్యం సాధించడంపై దృష్టి పెట్టండి. అప్పుడు విజయం మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తుంది" అని హితవు పలికారు. నిరంతరం నేర్చుకుంటూ, కొత్త విషయాలు తెలుసుకోవాలనే కుతూహలాన్ని కలిగి ఉండాలని కోరారు.

**యువత కలలకు అండగా ఉంటాం**

"భారతదేశం గర్వపడేలా ఏదైనా నిర్మించాలని కలలు కనండి. అది కంపెనీ కావచ్చు, కొత్త టెక్నాలజీ కావచ్చు, లేదా సామాజిక కార్యక్రమం కావచ్చు. మీ కలల సాకారానికి, మీ ప్రయాణానికి మద్దతు ఇవ్వడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వాస్తవ సమస్యలను పరిష్కరించడానికి, ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి మీ జ్ఞానాన్ని ఉపయోగించండి" అని లోకేశ్ ఆకాంక్షించారు. 20 ఏళ్ల తర్వాత విద్యార్థులుగా కాకుండా పారిశ్రామికవేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, ఆవిష్కర్తలుగా తిరిగి వచ్చి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్.. సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం పెట్టుబడులలో భాగంగా ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం నుంచి రాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించారు. 'బేసిటీ' ప్రాజెక్టును యాంకర్ ప్రాజెక్టుగా చేసుకుని విశాఖ రీజియన్ అభివృద్ధిని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. వీఈఆర్ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని సూక్ష్మ స్థాయి ప్రణాళికతో సమగ్రాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ప్రణాళిక మూలపేట పోర్టు నుంచి రాజమండ్రిలోని అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు విస్తరించి ఉండాలని ఆయన సూచించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ వంటి కీలక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులను పరస్పరం అనుసంధానించడం ద్వారానే విశాఖ ఎకనామిక్ రీజియన్ వేగంగా ప్రగతి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. నిధుల కన్వర్జెన్స్ పద్ధతిని అనుసరించాలని, అవసరమైన చోట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (ఎ+ఫ్) స్కీంను కూడా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీఎం విజయ్ తొలి బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట.. పాఠశాల విద్యకే రూ.44,527 కోట్లు

ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వ తొలి పూర్తి స్థాయి బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం లభించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి పాఠశాల విద్య కోసం రూ.44,527 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి ఎన్.మారీ విల్సన్ ప్రకటించారు. 9 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం 'పెరుంతలైవర్ కామరాజర్ మోడల్ స్కూల్స్' పేరుతో ఆధునిక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యతో పాటు భోజనం, వసతి, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తారు. ఈ పథకానికి మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.125 కోట్లు కేటాయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాల మెరుగుదలకు 'సూపర్ క్లీన్.. సూపర్ క్యాంపస్' పథకం కింద రూ.129 కోట్లు కేటాయించారు. తొలి దశలో 10 వేల ప్రభుత్వ పాఠశాలల్లో దీన్ని అమలు చేయనున్నారు. ఉన్నత విద్యనభ్యసించేవాళ్లకు 'వెట్రి ల్యాప్‌టాప్ పథకం' కింద ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసేందుకు రూ.2,000 కోట్లు కేటాయించారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టే అవగాహన కార్యక్రమాలకు రూ.7 కోట్లు కేటాయించారు. సంక్షేమ పథకాలకూ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం అందించే పథకానికి రూ.560 కోట్లు కేటాయించింది. పెళ్లి రోజు వధువుకు ఎనిమిది గ్రాముల బంగారు నాణెం, పట్టు చీర అందించే పథకానికి రూ.812 కోట్లు ప్రతిపాదించింది.

రాష్ట్ర అప్పులు గత ఐదేళ్లలో రెట్టింపు అయ్యాయని మంత్రి తెలిపారు. అదనంగా రూ.16 వేల కోట్ల ఆదాయం రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## దిగొచ్చిన మెటా.. భారత్‌కు క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపారు. ప్రధాని మోదీ వీడియో తొలగింపు, తమ ప్లాట్‌ఫామ్‌లపై చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తి చెందడంపై ఆయన చింతిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు, తమ ప్లాట్‌ఫామ్‌ల నిర్వహణలో జరిగిన లోపాలను కూడా అంగీకరిస్తూ ఆయన విచారం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీకి చెందిన ఓ ఫేస్‌బుక్ పోస్ట్‌ను కొద్దిసేపు తొలగించడంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వివాదంపై చర్చించేందుకు మెటా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీలో ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా, అభ్యంతరకర, తప్పుడు కంటెంట్ వ్యాప్తిపై భారత ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళనలను మెటా ప్రతినిధులు అంగీకరించారని, ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లపై జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. యూజర్లకు ఏ కంటెంట్ చేరాలనేది ప్లాట్‌ఫామ్‌లే ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నప్పుడు, వాటిని కేవలం మధ్యవర్తులుగా పరిగణించలేమని భారత అధికారులు మెటాకు స్పష్టం చేసినట్లు సమాచారం.

ఇలాంటి పరిస్థితుల్లో ఐటీ చట్టం కింద లభించే 'సేఫ్ హార్బర్' రక్షణ వర్తించదని తేల్చిచెప్పారు. కొన్ని రకాల కంటెంట్‌ను ప్రోత్సహించేందుకు (బూస్టింగ్) భారీగా డబ్బులు చెల్లించినట్లు మెటా అంగీకరించిందని, ఈ తప్పులకు విచారం వ్యక్తం చేసిందని కూడా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రధాని మోదీ పోస్ట్ తొలగింపుపై మూడు రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పార్లమెంటరీ ప్యానెల్ మెటాను ఆదేశించింది. గడువులోగా స్పందించకపోతే మెటా 'సేఫ్ హార్బర్' రక్షణను కోల్పోతుందని ఐటీ మంత్రిత్వ శాఖ వర్గాలు హెచ్చరించాయి. ఈ పరిణామాల మధ్య మెటా ప్రతినిధులు ఐటీ కార్యదర్శితో భేటీ కావడం, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కూడా సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## నిరసనల్లో పాల్గొనే యువత పట్ల అత్యంత సహనంతో వ్యవహరించాలి

కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఆందోళనలు, వాటి సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థుల పట్ల అధికారులు అత్యంత విచక్షణతో, సహనంతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. హింసను అదుపు చేసే నెపంతో భద్రతా బలగాలు కూడా అంతే తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లలో సీజేపీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయని, జులై 20 నాటి నిరసనల్లో రాళ్లదాడి, హింస కారణంగా సార్వజనిక ఆస్తులకు జరిగిన నష్టానికి ఆ సంస్థనే బాధ్యులను చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కొత్త అర్జీని కూడా ఢిల్లీ తదితర ప్రాంతాల్లోని విద్యార్థి ఆందోళనలకు సంబంధించిన ప్రధాన కేసులతో సుప్రీంకోర్టు జతచేసింది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత ప్రదర్శనల సమయంలో పోలీసులు అత్యంత సంయమనం పాటించాలని సూచించిన సీజేఐ... యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. యువకులు అసలు ఏం కోరుకుంటున్నారు, వారి ఆవేదనకు కారణమేంటో ఓపికగా వినడమే అన్ని సమస్యలకు అత్యంత శక్తివంతమైన పరిష్కారమని వ్యాఖ్యానించారు. అయితే శాంతిభద్రతలను కాపాడే క్రమంలో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల విచక్షణపై తమకు నమ్మకం ఉందని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నివేదికలను పరిశీలించిన పిమ్మటే ఈ విషయంలో తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు ధర్మాసనం తెలిపింది.

## ఏఐతో భయపడొద్దు.. భారత్‌కు లాభాలే ఎక్కువ

కృత్రిమ మేధ (ఏఐ) వల్ల ఉద్యోగాలు పోతాయన్న ఆందోళనల మధ్య ప్రపంచ బ్యాంకు ఆసక్తికర నివేదిక విడుదల చేసింది. భారత్‌లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఏఐ ఉద్యోగాలను భర్తీ చేయడం కంటే, ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని వెల్లడించింది. సరైన చర్యలు తీసుకుంటే శతాబ్దం పట్టే అభివృద్ధిని పదేళ్లలోనే సాధించే అవకాశం ఉందని పేర్కొంది. ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం.. అధిక ఆదాయ దేశాల్లో ప్రస్తుతం ఉన్న ఉద్యోగాల్లో 14.2 శాతం ఏఐ ఆటోమేషన్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది. తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లో మాత్రం ఈ ముప్పు 4.5 శాతమే. అదే సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 16.2 శాతం ఉద్యోగాల్లో ఏఐ వల్ల ఉత్పాదకత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సంఖ్య 18.7 శాతంగా ఉంది. భారీ ఏఐ మోడళ్లు, ఖరీదైన డేటా సెంటర్ల నిర్మాణం కంటే స్థానిక అవసరాలకు అనుగుణంగా తక్కువ ఖర్చుతో పనిచేసే ఏఐ వ్యవస్థలను వినియోగిస్తే భారత్‌కు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని ప్రపంచ బ్యాంకు సూచించింది. విద్య, వైద్యం, వ్యవసాయం, న్యాయ సేవలు, ప్రభుత్వ సేవల్లో ఏఐ కీలక మార్పులు తీసుకురాగలదని అభిప్రాయపడింది. ఇప్పటికే భారత్‌తో పాటు కెన్యా, మెక్సికో, నైజీరియా, థాయ్‌లాండ్‌లో ఐదుగురికి పైగా ఉద్యోగులు ఉన్న సంస్థల్లో ఐదింటిలో ఒకటి ఏఐ చాట్‌బాట్‌లను వినియోగిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. అయితే విద్యుత్, ఇంటర్నెట్, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నాణ్యమైన డేటా, బలమైన వ్యవస్థలు లేకపోతే ఏఐ ప్రయోజనాలు పూర్తిగా అందవని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. దశలవారీగా ఏఐను అమలు చేయాలని, గోప్యతకు రక్షణ కల్పిస్తూ బాధ్యతాయుత వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించింది.

## రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

- మొదటి పేజి తరువాయి

వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు" అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

## విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్...

సాగర నగరం విశాఖపట్నం క్రీడా రంగంలో మరో కీలక ముందడుగు పడింది. భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఏర్పాటు చేస్తున్న 'సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శంకుస్థాపన చేశారు. అరిలోవ సమీపంలోని తోటగరువులో ఈ అకాడమీని నిర్మించనున్నారు.

ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి లోకేశ్‌కు పీవీ సింధు, ఆమె కుటుంబ సభ్యులు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం, పీవీ సింధు, క్రీడాశాఖ మంత్రితో కలిసి లోకేశ్ శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి, నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం అకాడమీ భవన నమూనాను, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురానున్న అత్యాధునిక సౌకర్యాలను మంత్రి లోకేశ్ ఆసక్తిగా పరిశీలించారు. అకాడమీ లక్ష్యాలు, వసతుల గురించి సింధును అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టుపై రూపొందించిన ప్రత్యేక ఆడియో విజువల్ (ఏవీ) ప్రజెంటేషన్‌ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, శాప్ ఎండీ భరణి, గ్రీన్ కో ఎనర్జీ డైరెక్టర్ చలమలశెట్టి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## దేవరపల్లిలో జగన్ పర్యటన.. శ్రుతిమించిన శ్రేణుల ఉత్సాహం!

- మొదటి పేజి తరువాయి

గందరగోళానికి దారితీసింది. తమ నాయకుడికి స్వాగతం పలికే క్రమంలో కొందరు కార్యకర్తలు విపరీత ధోరణులతో వ్యవహరించడం స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. స్థానికంగా ఉన్న ఓ దుకాణాన్ని కూడా ధ్వంసం చేసినట్టు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే, జగన్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ దేవరపల్లిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ అయిన వెంటనే, ఆయన్ను చూసేందుకు కార్యకర్తలు ఒక్కసారిగా దూసుకువచ్చారు. ఈ క్రమంలో అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లను సైతం లెక్కచేయకుండా తోసుకురావడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో బారికేడ్లు విరిగిపోయి, స్వల్పంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అంతేకాకుండా, దేవరపల్లి ప్రధాన రహదారులపై వైసీపీ కార్యకర్తలు బైక్‌లతో చేసిన హంగామా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. అనేకమంది యువకులు తమ బైక్‌ల సైలెన్సర్లను తొలగించి, భారీ శబ్దాలతో మితిమీరిన వేగంతో వాహనాలు నడిపారు. ప్రధాన కూడళ్ల వద్ద ప్రమాదకరంగా బైక్ విన్యాసాలు చేస్తూ హల్‌చల్ సృష్టించారు. ఈ పరిణామాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తమ అభిమాన నేతపై ఉన్న ఉత్సాహాన్ని ప్రదర్శించే క్రమంలో కార్యకర్తలు శ్రుతిమించడం విమర్శలకు తావిచ్చింది.

## 20నిమిషాల్లో 7పేలుళ్లు.. దద్దరిల్లిన దుబాయ్

- మొదటి పేజి తరువాయి

పేలుళ్ల కారణంగా పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఈ పారిశ్రామిక ప్రాంతం పక్కనే ప్రపంచంలోనే అతిపెద్ద నౌకాశ్రయం ఉంది. పేలుళ్ల అనంతరం దుబాయ్‌లోని ఓడరేవుకు ఆనుకుని ఉన్న ఇంధన నిల్వ, రవాణా కోసం ఉపయోగించే ఒక గిడ్డంగిలో మంటలు చెలరేగినట్లు ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. పేలుళ్ల వెనక హూతీల హస్తం ఉందని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. యెమెన్ నుంచి ఈ క్షిపణి దాడులు జరిగినట్లు ఇరాక్ ఆరోపించింది. కాగా ఈ పేలుళ్లపై యూఏఈ అధికారిక ప్రకటన చేయలేదు.

## హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ.. 8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు!

- మొదటి పేజి తరువాయి

తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

హైడ్రా కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే, కమిషనర్ పేరు మీద దొంగ సంతకాలతో ఫేక్ ఎన్‌ఓసీలు సృష్టించారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అఫిలియేషన్ (అనుమతులు) సాధించడం కోసం సదరు ప్రైవేటు కాలేజీలు ఈ నకిలీ పత్రాలను సమర్పించాయి. అయితే బోర్డు అధికారులు, హైడ్రా యంత్రాంగం డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు ఆ సర్టిఫికెట్లు నకిలీవని, వారి సంతకాలు ఫోర్జరీకి గురయ్యాయని తేలింది. ఈ దారుణ అక్రమంపై స్పందించిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు.. మోసానికి పాల్పడిన 8 కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.

**ఫోర్జరీకి పాల్పడిన జూనియర్ కాలేజీలు ఇవే:**

శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, చాంద్రాయణగుట్ట
రెసోనెన్స్ జూనియర్ కాలేజ్, ఎస్ఆర్ నగర్
హైందవి జూనియర్ కాలేజ్, బర్కత్‌పుర
ప్రియాం జూనియర్ కాలేజ్, మెహదీపట్నం
న్యూ ఎరా జూనియర్ కాలేజ్, చిక్కడపల్లి
మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, విద్యానగర్
షాహీన్ జూనియర్ కాలేజ్, శివరాంపల్లి
వశిష్ట జూనియర్ కాలేజ్, తెల్లాపూర్.

# సచివాలయ సిబ్బంది హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్




- హాజరు వివరాలు రోజూ ఇవ్వాలి-విధులకు డుమ్మా కొడితే చర్యలు
- ఉద్యోగుల హాజరుపై కలెక్టర్ ఆగ్రహం

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/ గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 5 :**జిల్లాలోని అన్ని శాఖల్లో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి జిల్లా అధికారుల వరకు ప్రతి ఉద్యోగి విధులకు క్రమం తప్పకుండా హాజరై బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ టి. నిషాంతి ఆదేశించారు. బుధవారం పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో శాఖల వారీగా పనితీరు, లక్ష్యాల సాధన, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి సిబ్బంది విధులకు సక్రమంగా హాజరైతే ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు జిల్లా అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. శాఖాధిపతులు తమ పరిధిలోని సిబ్బంది హాజరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది హాజరు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే వారం రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం సచివాలయాల హాజరు వివరాలను జాయింట్ కలెక్టర్‌కు సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది హాజరును కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వైద్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి తక్కువగా ఉన్న మండలాలపై ఇంజినీరింగ్ శాఖల అధికారులు ప్రత్యేక నివేదిక, కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సూచించారు. ఐవీఆర్ఎస్ పనితీరు తక్కువగా ఉన్న శాఖలు కారణాలను విశ్లేషించి మెరుగుదలకు కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు తమ శాఖల సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి లక్ష్యాలు, పురోగతి, పెండింగ్ అంశాలపై సమీక్షించాలని, సమావేశాల ఫోటోలను జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో పంపాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఏపీ ఓపీటీజీఎం వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి హేమలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# ద్వారకా బస్ స్టేషన్‌లో మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు




**విశాఖ దక్షిణం పెన్ పవర్ ఆగస్టు 05** :విశాఖపట్నంలోని ఏపీఎస్ఆర్టీసీ ద్వారకా బస్‌స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత భాగ్చి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్‌స్టేషన్‌లో అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన కమిషనర్, ప్రయాణికుల భద్రతను మరింత బలోపేతం చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని అధికా రులను ఆదేశించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, పోలీస్ చెక్‌పోస్ట్ సమీపంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉమెన్ సేఫ్టీ కియోస్క్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కియోస్క్ నిర్వహణలో పోలీసు సిబ్బంది సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. ద్వారకా బస్‌స్టేషన్‌తో పాటు నగరంలోని ఇతర ప్రధాన బస్‌స్టేషన్లలో కూడా పోలీసు గస్తీని మరింత పెంచాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (నార్త్), టూ టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పోలీస్ కమిషనర్‌కు ఏపీఎస్ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ బి. అప్పలనాయుడు స్వాగతం పలికారు. అనంతరం బస్‌స్టేష న్‌లోని వివిధ విభాగాలను సందర్శించిన కమిషనర్, భద్రత, పరిశుభ్రత, ప్రయాణికులకు అందిస్తున్న సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు.

తనిఖీల సమయంలో ప్రాంతీయ మేనేజర్ బి. అప్పలనా యుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె. పద్మావతి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ గంగాధర్, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి దుర్గాప్రసాద్, వాల్టేర్ డిపో మేనేజర్ కె.ఎస్.డి. ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ ఎస్.ఎస్. నాయుడు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీ అనంతరం బస్‌స్టేషన్‌లోని మరుగుదొడ్లు, డస్ట్‌బిన్లు, పరిశుభ్రత నిర్వహణ తీరుపై పోలీస్ కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేశారు.

# విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన




మంత్రి లోకేష్ భూమిపూజ

**విశాఖ తూర్పు పెన్ పవర్ ఆగస్టు 05:**రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడింది. విశాఖపట్నం అరిలోవ తోటగరువులో భారత ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు నెలకొల్పనున్న 'సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' నిర్మాణానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం శంకుస్థాపన చేశారు.

అకాడమీ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు పీవీ సింధు, ఆమె కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీవీ సింధు, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి మంత్రి లోకేష్ పూజా కార్యక్రమాలు నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అకాడమీ భవన నమూనాను పరిశీలించారు. క్రీడాకారులకు అందుబాటులోకి రానున్న అత్యాధునిక సదుపాయాలు, వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అకాడమీపై రూపొందించిన ఏవీని వీక్షించారు.

అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు

ఈ అకాడమీలో బ్యాడ్మింటన్‌తో పాటు పలు ఇతర క్రీడల్లో రాణించే క్రీడాకారులకు శిక్షణ ఇవ్వనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కోర్టులు, జిమ్, వసతి గృహాలు, స్పోర్ట్స్ సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, శాప్ ఎండీ ఎస్.భరణి, గ్రీన్ కో ఎనర్జీ ఎఫీషియన్సీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ చలమలశెట్టి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# పీవీ సింధు అకాడమీ ప్రైవేటు కార్యక్రమానికి బహిరంగ జన సమీకరణ







- వాహనం పైనుండే మంత్రి లోకేష్ పలకరింపు-బయటి వారికి ఎంట్రీ లేదన్న అకాడమీ సిబ్బంది
- గంటల తరబడి ఎండలో వేచి ఉన్నా ఒక్కమాట లేదు
- లోకేష్ పర్యటనతో ఆరిలోవలో స్తంభించిన ట్రాఫిక్
- మండుటెండలో గంటల తరబడి మహిళల అవస్థలు

**విశాఖ తూర్పు, పెన్ పవర్, ఆగస్టు 05:**తూర్పు నియోజకవర్గం ఆరిలోవ పెద్దగదిలి సమీపంలో పీవీ సింధు అకాడమీ భూమి పూజ కార్యక్రమానికి గురువారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఇది పూర్తిగా అకాడమీ సొంత కార్యక్రమని, మీడియా ప్రతినిధులకు మాత్రమే ఆహ్వానం ఉందని, బయటి వ్యక్తులకు, రాజకీయ నాయకులకు ప్రవేశం లేదని అకాడమీ సిబ్బంది స్పష్టం చేశారు. అయినప్పటికీ మంత్రి నారా లోకేష్ వస్తున్నారనే కారణంతో కూటమి నాయకులు తమ బలం చూపించుకునేందుకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేశారు.

అకాడమీలో జరిగే కార్యక్రమానికి కొందరిని మాత్రమే లోపలికి రానిచ్చి బిజెపి, జనసేన నాయకులను లోపలికి అనుమతించలేదు. దీంతో ఆగ్రహించిన నాయకులు పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగారు. పైకి చెప్పలేకపోయినా తెలుగు తమ్ముళ్లది అదే పరిస్థితి. పరిస్థితి చేయి జారిపోకుండా టిడిపి నాయకులు బుడుమూరి గోవింద్ వారికి సర్ది చెప్పారు.

పూలతో, జైజై నినాదాలతో గంటల తరబడి మండుటెండలో మహిళలు వేచి ఉన్నారు. కానీ కార్యక్రమ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ వారిని పలకరించకుండా, కార్యక్రమం గురించి ఒక్క మాట కూడా మాట్లాడకుండా వాహనం పైనుండే చేతులు ఊపుతూ నేరుగా అకాడమీ లోపలికి వెళ్లిపోయారు. కార్యక్రమం ముగిసి ఆయన తిరిగి వచ్చే వరకు ప్రజలు అక్కడే వేచి ఉండాల్సి వచ్చింది. తిరిగి వచ్చిన తర్వాత కూడా వాహనం పై నుంచి చేతులు ఊపి వీడ్కోలు తీసుకుని వెళ్లిపోయారు.

"ప్రైవేటు కార్యక్రమం అంటున్నారు. మరి మమ్మల్ని ఎందుకు పిలిపించారు" అని మహిళలు ప్రశ్నించారు. కొన్ని ప్రాంతాల్లో గ్రూపు మహిళలు కార్యక్రమానికి రాకపోతే ఊరుకునేది లేదని ఆర్పీలు హెచ్చరించినట్లు ఆరోపణలు వచ్చాయి.

మంత్రి పర్యటన కారణంగా ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ తీవ్రంగా అంతరాయం ఏర్పడింది. పోలీసులు పలు రహదారులను దారి మళ్లించడంతో సిటీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సు దిగి కిలోమీటర్ దూరం నడవలసి వచ్చిందని పలువురు ఆరోపించారు.

ఆహ్వానం లేకుండానే జనాన్ని తీసుకువచ్చి, ఎండలో ఉంచి, చివరకు పలకరించకుండా వెళ్లిపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గొర్రెలమెట్ట "పాఠశాల" సమస్య కలెక్టర్ దృష్టికి...!





- బిజెపి మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరీ పార్వతి

**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 5 :** మండలంలోని బుదరాళ్ల పంచాయతీ గొర్రెల మెట్ట సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బిజెపి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి జుర్రా గౌరీ పార్వతి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. బుదరాళ్ల పంచాయతీ అత్యంత మారుమూల గొర్రెలమెట్ట గ్రామాన్ని మండల బిజెపి నేతల సందర్శించి అక్కడి ప్రజలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తమ గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాల భావన పైకప్పు రేకులు ఎగిరిపోయి శిధిలావస్థకు చేరిందని తెలిపారు.

దీంతో గ్రామ సమీప క్రైస్తవ ప్రార్థన మందిరంలో విద్యార్థులు చదువులు సాగిస్తున్నారని తెలిపారు. తమ పాఠశాల భవనం మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో పలుమార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఫలితం లేకపోయిందని దీంతో చర్చి నిర్వాహకుల అనుమతితో అక్కడే కొనసాగించాల్సి వస్తుందని తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాల్సిందిగా కోరారు. అనంతరం పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు పలకలు నోరు పుస్తకాలు పెన్నులు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని సూచించారు. పాఠశాల సమస్యను సమస్యను తమ పార్టీ పెద్దల దృష్టికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని బిజెపి నేతలు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్, పాడేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మంగతల్లి, మండల ప్రధాన కార్యదర్శి పద్మరాజు, జిల్లా నేత మేడి బోయిన చక్రరావు (చిన్న) యువమోర్చా అధ్యక్షుడు మణికంఠ, ఉపాధ్యక్షుడు చిన్నిరాజు, వనవాసి ప్రతినిధులు డివిడి ప్రసాద్, నాగేశ్వరరావు, స్థానిక వార్డు సభ్యుడు సంజీవ్ తదితర పలువురు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ భవనం లేక ఇబ్బందులు

- 2007 నుంచి మినీ కేంద్రం.. ఈ ఏడాది జనవరిలో మెయిన్ సెంటర్‌గా గుర్తింపు
- వర్షాకాలంలో చిన్నారులకు అవస్థలు.. భవనం నిర్మించాలని డిమాండ్



**గూడెం కొత్తవీధి,పెన్‌పవర్,ఆగస్టు 5:** అంగన్‌వాడీ భవనం లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే భవనం నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని రింతాడ పంచాయతీ ఏబులం కుమ్మరివీధి గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాన్ని వైసీపీ పంచాయతీ అధ్యక్షుడు సోబోయ్ రామూర్తి బుధవారం సందర్శించి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో 2007 నుంచి మినీ అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోందని, ఈ ఏడాది జనవరి నుంచి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంగా గుర్తించినప్పటికీ భవనం లేకపోవడంతో చిన్నారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. గతంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి గ్రామస్థులు స్థలం ఇచ్చారని, అధికారులు స్థలాన్ని కొలతలు తీసుకున్న అనంతరం పనులు నిలిచిపోయాయని వివరించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో చిన్నారులు మరింత ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీ భవనంతో పాటు గ్రామంలో డ్రైనేజీ సౌకర్యం కూడా కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రామూర్తి గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంకిపాటి సత్తిబాబు, మల్లేశ్వరరావు, జోగిరాజు, గొల్లోరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## రామారావుకు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పరామర్శ

- ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే ఎంవీఆర్



**గూడెం కొత్తవీధి, పెన్‌పవర్, ఆగస్టు 5:** గూడెం కొత్తవీధి మండలం పెదవలస పంచాయతీ మాజీ వైస్ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మావూరి రామారావును పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పరామర్శించారు. రామారావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం పెదవలస గ్రామానికి వెళ్లి ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామారావుకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం మెరుగుపడిన అనంతరం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచిస్తూ భరోసా కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, చింతపల్లి ఎంపీపీ కోరభూ అనూషదేవి, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి భూసారి కృష్ణారావు, వైస్ ఎంపీపీ దేవుడు, దేవరపల్లి ఎంపీటీసీ పోతురాజు కృష్ణమూర్తి, నాయకులు లమ్మసింగి రమేష్, సాగేని గంగన్నపడాల్, జల్లి బాబులు, వంతల చంటిబాబు, కంకిపాటి నారాయణ, కొర్ర బాబీ, రామ్మూర్తి, కంకిపాటి నవీన్, దేశెట్టి రాంబాబు, కంకిపాటి శంకరరావు, రాట కన్నబాబు, ఎస్కే మీరా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముస్తఫా అరెస్టు రాజకీయ కక్షసాధింపే: వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం నేతలు




**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 5:** మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, ఆయన కుమారుడి అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నాయకులు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ముస్తఫాపై నమోదు చేసిన కేసు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని ఆరోపించారు.

వైఎస్సార్‌సీపీ ఎస్ఈసీ సభ్యుడు జహీర్ అహ్మద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేసి వేధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. ముస్తఫా పొగాకు వ్యాపారానికి సంబంధించి రూ. 30 లక్షలు చెల్లించినప్పటికీ సరుకు అందకపోవడంతో జరిగిన వ్యాపార వివాదాన్ని ఉద్దేశపూర్వకంగా "కిడ్నాప్" కేసుగా చిత్రీకరించారని ఆరోపించారు. సంబంధిత వ్యక్తులను చివరికి పోలీసులకే అప్పగించిన నేపథ్యంలో కిడ్నాప్ ఆరోపణలు చేయడం రాజకీయ కుట్రలో భాగమని పేర్కొన్నారు.

జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు బర్కత్ అలీ మాట్లాడుతూ, ముస్తఫాపై నమోదు చేసిన కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైందని ఆరోపించారు. కాజా టోల్‌ప్లాజా, పెదకాకాని పోలీస్ స్టేషన్‌ల సీసీటీవీ దృశ్యాలను ప్రభుత్వం బహిర్గతం చేస్తే అసలు వాస్తవాలు బయటపడతాయని అన్నారు. ఈ కేసుపై హైకోర్టును ఆశ్రయించి చట్టపరంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ముస్లిం నాయకులను లక్ష్యంగా చేసుకుని వేధింపులు జరుగుతున్నాయని, ఇటువంటి చర్యలకు భయపడబోమని తెలిపారు.

జిల్లా షేక్ విభాగం అధ్యక్షుడు ఎం.డి. షరీఫ్ మాట్లాడుతూ, సమగ్ర విచారణకు ముందే మాజీ ప్రజాప్రతినిధి ముస్తఫా, ఆయన కుమారుడిని అరెస్టు చేయడం బాధాకరమని అన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్దోషులపై వేధింపులు నిలిపివేయాలని కోరారు.

ఈ సమావేశంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు ఎస్.కే. బాజ్జి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలి.. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలి

- జీవో నంబర్ 3పై సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం
- జాతి ద్రోహులతో పోరాటాలు ఏమిటి? డాక్టర్ వంపూరు గంగులయ్య




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు5:** ఆదివాసీల హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్, జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య అన్నారు. బుధవారం ఆయన సమకాలీన గిరిజన సమస్యలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగులయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు తమ సమస్యలపై స్వేచ్ఛగా మాట్లాడేందుకు, ప్రభుత్వ కార్యాలయాల్లో వినతులు సమర్పించేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు కల్పిస్తున్న స్వేచ్ఛ కారణంగానే ఇటీవల గిరిజన ప్రాంతంలో జరిగిన ఉద్యమం విజయవంతమైందని పేర్కొన్నారు.

**పాడేరు రెవెన్యూ డివిజన్‌పై..**

గతంలో జరిగిన జోన్ల విభజనలో పాడేరు ప్రాంతానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పాడేరు రెవెన్యూ డివిజన్‌ను ఉమ్మడి విశాఖ జిల్లాలోనే కొనసాగించాలని తాము ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను కలిసి వినతులు అందజేశామని తెలిపారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. తమ ప్రయత్నాల నేపథ్యంలో పాడేరు రెవెన్యూ డివిజన్‌ను ఉమ్మడి విశాఖలోనే ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని గంగులయ్య పేర్కొన్నారు.

**జీవో నంబర్ 3పై ఆశాభావం:**

జీవో నంబర్ 3 విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని, దీనిపై అధ్యయన కమిటీ ఏర్పాటు చేసి న్యాయపరమైన సమీక్షతో పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోందని తెలిపారు. అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఆదివాసీల హక్కుల కోసం ఉద్యమాలు చేయడం తప్పు కాదని, అయితే ఏ కార్యక్రమానికైనా పిలుపునిచ్చే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఉద్యమాలు అనుకోని శక్తుల చేతుల్లోకి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూ ప్రస్తుత ప్రభుత్వం సాధ్యమైన పనులను చేపడుతున్న నేపథ్యంలో నిర్మాణాత్మకంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఆదివాసీ సమస్యలపై పోరాడుతున్న వారందరూ ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని, ఎవరి వల్ల మేలు జరిగిందనే విషయాన్ని పక్కనపెట్టి చివరికి ఆదివాసీ సమాజానికి మేలు జరగడమే ప్రధాన ఉద్దేశంగా ఉండాలని గంగులయ్య అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నప్పుడు ప్రోత్సహించడం కూడా ప్రజాస్వామ్యంలో బాధ్యతేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షురాలు కిట్లంగి పద్మ, సీనియర్ నాయకులు సీదరి రామమూర్తి, మండల అధ్యక్షుడు నందోలి మురళీకృష్ణ, బొంకుల దివ్యలత, మండల ఉపాధ్యక్షులు సీసాల భూపాల్, మజ్జి సత్యనారాయణ, కుంచె దేవేంద్ర ప్రసాద్, ముదువ రాంబాబు, పట్టణ అధ్యక్షుడు మజ్జి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలి

- నెలలు గడుస్తున్నా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాని నగదు
- వైసీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 5:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన లబ్ధిదారులకు బకాయి నగదును తక్షణమే చెల్లించాలని వైసీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో ఉపాధి హామీ పథకం కింద ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పనులు చేసినప్పటికీ ఇప్పటికీ వారి ఖాతాల్లో నగదు జమ కాలేదని ఆయన పేర్కొన్నారు. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా కూలి డబ్బులు అందకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు నిర్ణీత కాలవ్యవధిలో కూలి చెల్లింపులు జరగాల్సి ఉండగా, నెలల తరబడి బకాయిలు పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగించే విషయమన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే సమయంలో ఉపాధి హామీ కూలి డబ్బులు అందితే రైతు కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలి బకాయిలను విడుదల చేసి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయాలని బొబ్బిలి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. లబ్ధిదారులను నెలల తరబడి నిరీక్షించే పరిస్థితి నుంచి బయటపడేలా ప్రభుత్వం,సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఎల్ఐసీ వాటాల విక్రయం నిర్ణయం ఉపసంహరించుకోవాలి: ఐసీఈయూ




**విశాఖపట్నం, పెన్ పవర్ ఆగస్టు 5 :** కేంద్ర ప్రభుత్వం భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)లో మరిన్ని వాటాలను విక్రయించాలని తీసుకున్న నిర్ణయాన్ని భారతీయ జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం, విశాఖపట్నం విభాగం తీవ్రంగా ఖండించింది. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉద్యోగులు, పెన్షనర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

ఉద్యోగుల సంఘం విభాగ ప్రధాన కార్యదర్శి గంటా వరప్రసాద్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం బహిరంగ వాటాల విక్రయం ద్వారా ఎల్ఐసీలో 2.5 శాతం వాటాలను విక్రయించాలని, అవసరమైతే మరో 4 శాతం వరకు అదనంగా విక్రయించే అవకాశం కల్పించిందని తెలిపారు. ఇది దేశంలోని అతిపెద్ద ప్రజా ఆర్థిక సంస్థలో ప్రభుత్వ యాజమాన్యాన్ని బలహీనపరిచే చర్య అని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేస్తామన్న కేంద్ర ప్రభుత్వ హామీలకు ఈ నిర్ణయం విరుద్ధమని పేర్కొన్నారు.

భారతీయ జీవిత బీమా సంస్థ కోట్లాది పాలసీదారుల విశ్వాసాన్ని సంపాదించిన జాతీయ సంస్థ అని, ప్రభుత్వ వాటా తగ్గింపు పాలసీదారులు, ఉద్యోగులు, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమని అన్నారు. ప్రతిపాదిత వాటాల విక్రయాన్ని వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాన్ని విరమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

## వికలాంగుల సమస్య పరిష్కరించాలని వినతిపత్రం

**అరకులోయ పెన్ పవర్ ఆగస్టు 05:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ బుజ్జి రెడ్డి అల్లూరి జిల్లా ట్రైబల్ డిజేబుల్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయాని అరకు వ్యాలీ లో వచ్చి సందర్శించడం జరిగింది.

మన అల్లూరి జిల్లా దివ్యాంగుల కోసం సొసైటీ తరఫున చేస్తున్నటువంటి సేవా కార్యా క్రమాలు కోసం కులం కుశంగా అడిగి తెలుసుకున్నారు.

దివ్యాంగుల గురించి చైర్మన్ ధర్మయ్య . ముఖ్యంగా కార్యాలయం ఏర్పాటు గురించి, దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు గురించి తర్వాత అర్హత ఉన్నటువంటి దివ్యాంగులకు పెన్షన్ గురించి అలాగే 85% శాతం వైకాల్యం దాటిన వాళ్లకి 15 వేల రూపాయలు పెన్షన్ హరత ఉన్నటువంటి వాళ్ళు అందరికీ పెన్షన్ ఇవ్వాలని కోరారు. చదువుకున్నటువంటి దివ్యాంగులకు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాలు వివంగుల కోట నుండి వచ్చే ఉద్యోగ అవకాశాలను కల్పించాలని ఇల్లు స్థలాలు కేటాయించాలని మొదలైనటువంటి అనేక సమస్యలను కులం కుశంగా వివరిస్తూ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చెప్పడం. జరిగింది

.

ఆయన సానుకూలంగా స్పందిస్తూ సమస్యను కచ్చితంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టిలో తీసుకువెళ్తానని హామీ ఇవ్వడం జరిగింది.

మీకు ఎటువంటి సమస్యలున్నా డైరెక్ట్ గా నా ద్వారాగా మీకు సమస్యలను పరిష్కారం చేయడానికి ఎల్లప్పుడూ ముందు ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం నుండి వచ్చే ఉచిత పరికరాలు వీల్ చైర్ ట్రై సైకిల్ శంకర కర్రలు మొదలైనటువంటి పరికరాలు రాష్ట్ర కమిషన్ చైర్మన్ చేతులమీదుగా దివ్యంగులకు అందజేయడం జరిగింది.

ఆయనతోపాటు ఎస్టి కమిషన్ సభ్యులు సాయిరాం, మల్లేశ్వర గొర్ల సునీత టైగర్ డైరెక్టర్ కూడా కృష్ణారావు బిజెపి జిల్లా అధ్యక్షురాలు మతం శాంతి కుమారి జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ వంతల దేవదాస్, అల్లూరి జిల్లా ట్రైబల్ డిజేబుల్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ బోరి బోరి ధర్మయ్య, సొసైటీ అసిస్టెంట్ డైరెక్టర్ పూజారి రామనాగేశ్వరరావు,గతుం రామరాజు, స్వామి యాదయ్య రామారావు తదితరులు పాల్గొన్నారు.



## తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషణ

- పుట్టిన బిడ్డకు 6 నెలల వరకు తల్లిపాలే శ్రేయస్కరం.
- సిహెచ్ సి సూపరింటెంట్ ధరణి, ఐసిడిఎస్ సిడిపిఓ యు విమల కుమారి.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 05.** తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషణ అని, పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసిడిఎస్ సిడిపిఓ యు విమల కుమారి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ ధరణి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో తల్లిపాల వారోత్సవానీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 0నుండి 6 నెలల పిల్లలకు కేవలం తల్లిపాలే శ్రేయస్కరమని, తల్లిపాలతో శిశువుకు వ్యాధులతో పోరాడే శక్తిని అందిస్తాయన్నారు. ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7 తేదీ వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి విమల కుమారి తెలిపారు. తల్లిపాల వలన శిశువుకు రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు తల్లి ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించడం మొదలుపెట్టి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, దీనివల్ల బిడ్డ శారీరక మానసిక ఎదుగుదల అధికంగా ఉంటుందన్నారు. తల్లిపాల ప్రయోజనాలపై కొంతమంది తల్లులకు అవగాహన కల్పించారు. తల్లి పాలు బిడ్డకు అమృతం, తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం అని పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ రాజేశ్వరి, స్వర్ణ, కొండమ్మ, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు గర్భిణీ స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## గూడెం కొత్తవీధిలో సినీ సందడి.. 'ధీర ధాత్రి' మూవీకి లొకేషన్ల వేట!

- ఆగస్టు మూడో వారం నుంచి చిత్రీకరణ ప్రారంభం..
- పలు ప్రాంతాలను పరిశీలించిన చిత్ర బృందం



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, ఆగష్టు 5:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో త్వరలో సినిమా షూటింగ్ సందడి నెలకొననుంది. కంభంపాటి ఫిల్మ్ స్టూడియోస్ నిర్మాణంలో తెరకెక్కనున్న 'ధీర ధాత్రి' చిత్రానికి సంబంధించి చిత్ర యూనిట్ మండలంలోని పలు ప్రాంతాల్లో షూటింగ్ లొకేషన్లను పరిశీలించింది. కంభంపాటి విజయ్ కుమార్ నిర్మాతగా, సలాది నవీన్ పవన్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకోనుంది. ఈ సినిమాలో వంశీ ఆకుల, మహిత ప్రధాన పాత్రల్లో నటించనున్నారు. ఆగస్టు మూడో వారం నుంచి సినిమా నిర్మాణం/చిత్రీకరణ ప్రారంభం కానున్నట్లు చిత్ర బృందం తెలిపింది. గూడెం కొత్తవీధి మండలంలోని ప్రకృతి అందాలు, పచ్చని కొండలు, గ్రామీణ వాతావరణానికి అనువైన పలు ప్రాంతాలను చిత్ర బృందం సందర్శించి పరిశీలించింది. సినిమా కథకు అనుగుణంగా లొకేషన్ల ఎంపికపై దర్శకుడు సలాది నవీన్ పవన్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ లొకేషన్ పరిశీలన కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గొర్లే వీర వెంకట్, సుర్ల వీరేంద్ర కుమార్, పరమేష్ తదితరులు పాల్గొని చిత్ర యూనిట్‌కు సహకరించారు.

# నాయి బ్రాహ్మణుల అభ్యున్నతికి సంగీత పాఠశాల ఏర్పాటు

- విశాఖ జిల్లాలో సంగీత పాఠశాల ఏర్పాటుకు తీర్మానం
- సంఘ కార్యాలయంతో పాటు ఆర్థిక నిధి ఏర్పాటు చేసుకోవాలి
- సమిష్టి కృషితో సంఘాన్ని మరింత బలోపేతం చేద్దాం : నరవ పైడిరాజు




**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 5 :** విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘాన్ని మరింత బలోపేతం చేసి, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సభ్యులంతా ఐకమత్యంతో పనిచేయాలని సంఘం ప్రధాన కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నరవ పైడిరాజు పిలుపునిచ్చారు. సంఘం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ప్రత్యేకంగా సంగీత పాఠశాల ఏర్పాటు చేసుకోవాలని ఆయన ప్రతిపాదించారు. కంచరపాలెం 35వ వార్డు ధర్మానగర్‌లోని శివాలయం వీధిలో, పార్వతి పరమేశ్వర ఆలయం సమీపంలోని శ్రీ సిద్ధార్థ సేవా భవన్లో విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం (రి.నెం. 500/82) జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం భవిష్యత్ కార్యక్రమాలు, సభ్యుల సంక్షేమం, సంఘాన్ని మరింత బలోపేతం చేయడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో సంఘ గౌరవ అధ్యక్షులు ముసిడిపల్లి రమణ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ సంఘానికి శాశ్వతంగా ఒక సంఘ కార్యాలయం ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంఘ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కార్యాలయం ఎంతో అవసరమని అన్నారు. సంఘ అధ్యక్షులు కోడూరు గణపతిరావు మాట్లాడుతూ సంఘం బలపడాలంటే ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేసుకుని, సంఘ భవిష్యత్ కార్యక్రమాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవాలని సూచించారు. సంఘ ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ సామాజిక వర్గంలో ఉన్న కళా ప్రతిభను వెలికితీసేందుకు సంగీత పాఠశాల ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం సహకారంతో, గౌరవ పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల సహకారం తీసుకుని విశాఖ జిల్లాలో సంగీత పాఠశాలను ఏర్పాటు చేసేందుకు కచ్చితంగా కృషి చేస్తామని తెలిపారు. సంగీతం, కళలపై ఆసక్తి ఉన్న నాయి బ్రాహ్మణ యువతకు సరైన శిక్షణ అందించడంతో పాటు, వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ పాఠశాల దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. సంఘ మహిళా అధ్యక్షురాలు కోడూరు చంద్రకళ మాట్లాడుతూ సభ్యులందరూ సమిష్టిగా, టీమ్ వర్క్‌తో ముందుకు సాగితే సంగీత పాఠశాల ఏర్పాటుతో పాటు సంఘం అభివృద్ధికి సంబంధించిన అన్ని లక్ష్యాలను సాధించవచ్చన్నారు. మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచుతూ సంఘ కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. సమావేశంలో సంఘం భవిష్యత్ అవసరాలు, నాయి బ్రాహ్మణ యువతలోని కళా ప్రతిభను ప్రోత్సహించడం, సాంస్కృతిక కార్యక్రమాలను అభివృద్ధి చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విశాఖ జిల్లాలో నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంగీత పాఠశాల ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో సంఘ అధికార ప్రతినిధి బల్లంకి వెంకట్రావు, పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షులు గోల్కొండ కర్ణాకర్, అదనపు కోశాధికారి మల్లువలస వర్మ, కంచరపాలెం అధ్యక్షులు ఉప్పులి మల్లేశ్వరరావు, డాబాగార్డెన్ జోనల్ అధ్యక్షులు గూడుపువలస సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గ ఇన్‌చార్జిలు తెలుకారాపు సుందర్‌రావు, చల్లపల్లి శ్రీనివాసరావు, తాటితూరి అప్పారావు, పైడివాడ శ్రీనివాసరావు, నల్లబిల్లి సత్యనారాయణ, పట్నాల గంగరాజు, మడుతూరి శీను, రాజన్న రాముడు, ఆరిపాక కృష్ణ, ఆతవ ఈశ్వరరావు, కొరవాడ గణేష్, పాతర్లపల్లి ఆనంద్, చింత ఆంజనేయులు, చింతపల్లి సూర్యనారాయణ, బొడ్డాప శ్రీనుతో పాటు వివిధ జోన్ల అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నడింపాలెం ఆశ్రమ బాలుర పాఠశాలలో భోజన సౌకర్యం భేష్...!

- స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమల దేవి ...



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 5 :** గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థినీ, విధ్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించటంతో పాటు విద్యా ప్రమాణాల మార్పుకు పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమల దేవి అన్నారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలో ఉన్న నడింపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల మరియు పేద మాకవరం బాలికల ఆశ్రమ పాఠశాలలను స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమల దేవి సందర్శించారు. ఆయా ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించాల్సిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహాల పరిసరాల పరిశుభ్రత, తరగతి గదులను తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ సభ్యులు మెచ్చుకున్నారు. అనంతరం నడింపాలెం పాఠశాల విద్యార్థులను ప్రశ్నించి ఇక్కడ రోజు అందించే భోజనాన్ని ఏ విధంగా ఉంటుందో అడిగి తెలుసుకోగా విద్యార్థులు రోజు భోజనాన్ని సంతృప్తిగానే అందిస్తున్నట్టు అన్ని తరగతుల విద్యార్థులు కమిషన్ సభ్యులకు తెలపటంతో ఆమె ఒకే భేష్ అంటూ కితాబు ఇచ్చారు. పేద మాకవరం బాలికల ఆశ్రమ పాఠశాలలో తనిఖీ చేసిన కమిషన్ సభ్యులు బాలికలకు అందించే ఆహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రుచి చూసి సంతృప్తి చెందారు. ఇక్కడ ఆశ్రమ పాఠశాల బాలికలు ప్రదర్శించిన దిమ్మశా నృత్యప్రదర్శన తిలకించిన కమిషన్ సభ్యులు గంజిమల దేవి విద్యార్థినీలను అభినందించి విద్య పట్ల మరింత శ్రద్ధ వహించాలని అంతా ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ఇప్పటి నుండే కృషి చేయాలని అన్నారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రకృతి వ్యవసాయ రైతులతో అవగాహన సదస్సు.



**గుమ్మ లక్ష్మీపురం ఆగస్టు 05 పెన్ పవర్.** ఎల్ నీనో ప్రభావాన్ని అధికమిద్దాం విత్తన గులికలతో విజయవంతమైన సాగు శ్రీకారం చేద్దాం,గుమ్మ లక్ష్మీపురం మండలం చెముడు గూడ పంచాయతీ పరిధిలోని పుట్టా జమ్ము గ్రామంలో ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డి.పి.యం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నాడు రైతులకు మహిళా సంఘాలకు ఎల్ నినో ప్రభావం వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ మేరకు డి.పి.ఎం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ,ఎల్ నినో ప్రభావాన్ని అధికమిద్దాం విత్తన గులికలతో విజయవంతమైన సాగు శ్రీకరం చేద్దాం ఎల్ నినో ప్రభావం నుండి పంటలని భూమిని కాపాడుకుందం ప్రకృతి వ్యవసాయం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. అవగాహన సమావేశం అనంతరం తొమ్మిది రకాల విత్తనాలతో విత్తనబంతులను తయారు చేసి వాటి వల్ల ఉపయోగాలు పై అవగాహన కల్పించారు. విత్తన బంతులు తయారు చేయడం వలన లాభాలు,స్వల్ప వర్షపాతం వచ్చిన తేమను మిలికలు చేరి మంచి మొలక వచ్చేలా సహాయపడుతుంది. విత్తన గులికలు ఆరు నెలల పాటు నేలలో సురక్షితంగా ఉంటాయి కావున వర్షము ఆలస్యంగా కురిసిన విత్తనాలు మల్కశాతం వస్తాయి విత్తనానికి జీవం కాపాడుతుందని,అంతేకాక ఎల్ నిన్యో సవాలును అధికమిద్దాం విత్తన గులికలతో విజయవంత మైన సాగుశ్రీకారం చేద్దాం,మొక్క మొదటి దశలో తేమ నిలవడానికి తోడుపడుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంటిఎల్ గణేష్ చంద్ర,మండల మార్కెటింగ్ ఏంటి,జి నిర్మల దేవి,ఎఫ్ఎంటి.కే భూషణ్ రావు,ఐ.సి.ఆర్ పి,ఎస్ పద్మ,రమ్య శ్రీవాణి,లక్ష్మీ ప్రియ,మరియు రైతులు పాల్గొన్నారు

## గోపాలపట్నం రైతు బజార్‌లో ప్రత్యేక బియ్యం కౌంటర్ ప్రారంభం

- రాయితీ ధరలకు సన్న బియ్యం విక్రయాలు
- కిలోపై రూ.10 వరకు తగ్గింపు
- రైస్ కార్డు కలిగిన ఆధార్‌దారుడికి 10 కిలోల వరకు బియ్యం
- సామాన్య ప్రజలకు ధరల భారాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం
- రైతు బజార్ స్టాళ్లను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 5 :** ధరల భారంతో ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక సన్న బియ్యం విక్రయ కౌంటర్‌ను గోపాలపట్నం రైతు బజార్‌లో విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కౌంటర్‌లో రాయితీ ధరలకు సన్న బియ్యం విక్రయాలను ప్రారంభించారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 62 వరకు విక్రయిస్తున్న సన్న బియ్యాన్ని ప్రత్యేక కౌంటర్ ద్వారా కిలో రూ. 52కే వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. అలాగే మార్కెట్‌లో కిలో రూ. 60గా ఉన్న మరో రకం సన్న బియ్యాన్ని కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులకు కిలోపై రూ. 10 వరకు ఆదా కానుంది. రైస్ కార్డు కలిగి ఉన్న ఆధార్ కార్డుదారులకు ప్రత్యేక కౌంటర్‌లో ఒక్కో కార్డుపై గరిష్ఠంగా 10 కిలోల వరకు రాయితీ ధరలకు సన్న బియ్యం అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి నిత్యావసర వస్తువులను అందుబాటు ధరల్లో విక్రయించడం ద్వారా సామాన్య ప్రజలపై ధరల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. మార్కెట్ ధరలతో పోలిస్తే తక్కువ ధరకు నాణ్యమైన సన్న బియ్యం లభించడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అపర్ణ ప్రసాద్, వైస్ చైర్మన్ వి. చంద్రశేఖర్, డైరెక్టర్లు శివ, సుభాని, నాగులపల్లి లత, లలిత, నాగేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు డి. రమేష్ పాల్గొన్నారు. అలాగే జిల్లా ప్రాంతీయ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పి. సుధాకర్, జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కర్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ శ్రీనివాస్ కిరణ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి బి. రవికుమార్, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ, ఎస్టేట్ అధికారి జి. ప్రసాద్, సహాయకుడు ఆర్. సత్యనారాయణ తదితర అధికారులు, మార్కెట్ కమిటీ సిబ్బంది, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

# సర్క్యూట్ బోర్డులదే భవిష్యత్‌లో హవా





- పీసీబీ రూపకల్పనలో నైపుణ్యం సాధిస్తే ఉన్నత అవకాశాలు
- శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా బెహరా చైతన్య వివరణ

**పెందుర్తి, నరవ, పెన్ పవర్, ఆగస్టు 5 :** రానున్న రోజుల్లో సాంకేతిక రంగంలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల (పీసీబీ) ప్రాధాన్యం మరింత పెరగనుందని బెహరా విద్యాసంస్థల సెక్రటరీ డా. బెహరా చైతన్య అన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నరవలోని బెహరా విద్యాసంస్థల్లో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. ఈ శిక్షణలో ఈసీఈ, ఈఈఈ విభాగాల్లో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు పాల్గొన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులకు డా. బెహరా చైతన్య చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డా. బెహరా చైతన్య మాట్లాడుతూ.. పీసీబీ రూపకల్పన, తయారీ ప్రక్రియపై ప్రాయోగిక అవగాహన పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఆటోమేషన్ తదితర సాంకేతిక రంగాల్లో మెరుగైన ఉపాధి, ఉన్నత అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కేవలం పాఠ్యపుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, పరిశ్రమలకు అవసరమైన ప్రాక్టికల్ స్కిల్స్‌ను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మూడు రోజుల శిక్షణలో పీసీబీ రూపకల్పన, సర్క్యూట్ డిజైన్, సంబంధిత సాంకేతిక అంశాలపై విద్యార్థులకు శిక్షణ అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్‌లో ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ బాణాల తరుణ్, ఇంజనీరింగ్ ప్రిన్సిపల్ డా. శ్రీధర్ పట్నాయక్, అకడమిక్ డైరెక్టర్ సుకన్య, ప్రిన్సిపల్ అనిల్, ప్రోగ్రామ్ కన్వీనర్లు గోవిందరాజు, శ్రీకాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సాయి గణేష్, జోష్ణ, కామేష్, పీసీబీ ట్రైనర్లు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.




## బూసులులో 25 మంది గిరిజన రైతులకు భూ హక్కు పట్టాలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 5**
కూటమి ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో భాగంగా 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం ద్వారా గిరిజన రైతులకు భూ హక్కు పట్టాల పంపిణీ చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధిలోని బూసులు గ్రామంలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన 25 మంది గిరిజన రైతులకు భూ హక్కు పట్టాలను జీకే వీధి మండల డిప్యూటీ తహసీల్దార్ ధుమంతి సత్యనారాయణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పట్టాలు అందుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీకే వీధి టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, మాజీ సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, టీడీపీ సీనియర్ నాయకులు మొట్టడం రామకృష్ణ, గడుతూరి అప్పారావు, వీఆర్వో, వీఆర్ఏ, గ్రామ పెద్ద జర్తా సోమలింగంతో పాటు మహిళలు, రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్ర వివరాల సేకరణకు శ్రీకారం

- ఆగస్టు 17 నుంచి సెప్టెంబరు 15 వరకు క్షేత్రస్థాయి సర్వే



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఆగస్టు 5 :** జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో క్షేత్రస్థాయి సమాచార సేకరణకు శ్రీకారం చుట్టారు. బుధవారం పాడేరు జిల్లా కలెక్టరేట్‌లో మాస్టర్ శిక్షకులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు మాట్లాడారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబరు 15 వరకు ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా గ్రామాలు, పంచాయతీల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి వివరాలను సేకరించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం, పంచాయతీకి సంబంధించిన జనాభా, సామాజిక--ఆర్థిక పరిస్థితులు, తాగునీరు, విద్యుత్, రహదారులు, విద్య, వైద్యం, ఇతర మౌలిక వసతుల వివరాలను నమోదు చేయనున్నట్లు చెప్పారు. సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలు, గణాంక విశ్లేషణకు ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన సహాయ గణాంక అధికారులు, సాంకేతిక సహాయకులు మండల స్థాయిలో గ్రామ, పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఇస్తారని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా సర్వే పూర్తి చేసి, ఖచ్చితమైన వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ ఇన్‌చార్జి అనుకుల్ కుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ టి. ఫణి కళ్యాణ్, వివిధ మండలాల సహాయ గణాంక అధికారులు, సాంకేతిక సహాయకులు, శిక్షణార్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ భద్రత పై యువత జాగ్రత్తలు పాటించాలి...!

మంప ఎస్ ఐ శ్రీనివాస్ అవగాహన...



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు5:** రోజు రోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు పాటించాలని, రోడ్డు భద్రతతో పాటు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంప ఎస్ ఐ శ్రీనివాస్ తెలిపారు. కొయ్యూరు మండలం భూధరాళ్ళ పంచాయితీ శివారుగ్రామాలైన పోతవరం, పోకలపాలెం గ్రామాల్లో బుధవారం ఎస్ ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల గిరిజనులతో యువతకు సమావేశం అయ్యారు. ప్రధానంగా యువత వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్ ధరిస్తూ రోడ్డు సెఫ్టీ పాటిస్తూ సుఖమయ ప్రయాణం చేయాలని అవగాహన కల్పించారు. అలాగే మహిళల పట్ల పెచ్చుపెరిగిపోతున్న అఘాత్యాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని వారి భద్రత పట్ల గౌరవంగా మెలగాలని తెలియజేశారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తత మహిళల కోసం ప్రభుత్వం తీసుకున్న రక్షణ పై వివరించారు.అనంతరం వారి జీవన విధానం,వ్యవసాయం, సామాజిక భద్రత పై,జీవనాధారం ఏ విధంగా ఉంటుందో తెలుసుకున్నారు. ఇంకా పలు చోట్ల మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా చేయడం చేస్తున్న పరిస్థితులు ఉన్నాయని అలాంటి వాటి జోలికి పోవద్దనీ భవిష్యత్ లో ఎదుర్కొనే పరిణామాలపై గిరిజనులకు ఎస్ ఐ శ్రీనివాస్ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం...!

- డాక్టర్ జగదీష్ నాయక్.



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 5:** బిడ్డ పుట్టిన అరగంటలోపు వచ్చే ముర్రా పాలు ప్రకృతి ప్రసాదించిన తొలి వ్యాధి టీకా అని రాజేంద్రపాలెం పి హెచ్ సి వైద్యాధికారి జగదీష్ నాయక్ పేర్కొన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం పి హెచ్ సి పరిధిలో ఉన్న భూధరాళ్ల లో జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి అనంతరం తల్లి పాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాలు బిడ్డలకు ఏ రకంగా ఉపయోగపడతాయానే దానిపై వివరించారు. శిశు శారీరక ,మానసిక ఎదుగుదలకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరం అన్నారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్, గర్భశయ క్యాన్సర్ వంటి ప్రమాదం తగ్గుతుందని ఆయన సూచించారు.ఈ ర్యాలీ లో గ్రామస్తులు, వైద్య సిబ్బంది,అంగన్వాడీ కార్యకర్తలు,స్థానికులు, పాల్గొన్నారు.ం

## ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలనీ డిమాండ్

- సుమారు 4నెలలైనా అందని ఉపాధి కూలి డబ్బులు.
- సిపిఎం మండల నాయకులు జి నారాయణ, జీ జీనబందు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 05.** మండలంలో గల కరీముఖిపుట్టు పంచాయతీ పరిధిలో గల మొక్కపుట్టు గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు జి నారాయణ, జి జీనబందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ.. మొక్కపుట్టులో తాము సందర్శించినప్పుడు రెండు వారాలు ఉపాధి డబ్బులు ఇప్పటిదాకా పడలేదని ఉపాధి కూలీలు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. రెండు వారాలు చేసిన పనులకు సుమారు నాలుగు నెలలు గడుస్తున్నప్పటి నేటి వరకు బకాయిలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఉపాధి కూలీల ఎకౌంట్లో వెంటనే బకాయి సొమ్ము జమాచేయాలని, లేకుంటే పంచాయితీ పరిధిలోని ఉపాధి కూలీలతో ఎంపీడీవో కార్యాలయం ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు కే కృష్ణారావు, వి భాస్కరరావు, కే అభిమన్యుడు, వి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 05 :** తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష అని కేజీహెచ్ పీడియాట్రిక్స్ విభాగాధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం కేజీహెచ్ చిన్నపిల్లల విభాగంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ, తల్లిపాలు శిశువులకు అత్యుత్తమ పోషకాహారమని, వాటితో పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. తల్లిపాలు తాగి పెరిగిన పిల్లల్లో భవిష్యత్తులో మధుమేహం, ఉబకాయం వం టి జీవనశైలి సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు గణనీ యంగా తగ్గుతాయని వివరించారు. ప్రతి శిశువు సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే రక్షణ కవచమని పేర్కొంటూ, ప్రతి బాలింత తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో సీడీపీవో నీలిమా, ఏడీసీడీపీవో శ్రీలత, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, కేజీహెచ్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ను కలిన హుకుంపేట మండల పీసా కమిటీ.





**పీసా కమిటీ పలు సమస్యలపై ఆయనకు వినతి పత్రం అందజేత.**

**సమస్యలను వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి**

**హుకుంపేట పెన్ పవర్ ఆగస్టు 5** :అల్లూరి సీతారామ జిల్లా హుకుంపేట మండలం కామపేట గ్రామంలో స్వతంత్ర సమరయోధుడు మర్రి కామయ్యకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అలాగే రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ సోల్ల.భోజ్జి రెడ్డి మరియు ఎస్టీ కమిషన్ నెంబర్ కిలో సాయిరాంను మర్యాదపూర్వకంగా హుకుంపేట మండల పీసా సభ్యులు కలిసి పీసా లో ఉన్న అనేకమైన సమస్యలను వివరించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకొని వెళ్లాలని వినతిపత్రం అందజేసారు స్పందించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి తక్షణమే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు
ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల అధ్యక్షులు చప్పాలి శంకరరావు హుకుంపేట ప్రధాన కార్యదర్శి జన్ని.వెంకటరమణ హుకుంపేట మండల జాయింట్ సెక్రెటరీ జయరాం కుమార్, ట్రెజరర్ కొర్ర.కొండబాబు పీసా సభ్యులు చందు, జన్ని.లింగన్న గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది

## ఉత్తమ ఆదివాసి ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అవార్డులు అందించాలి.

- ట్రైబల్ రైట్స్ ఫారం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు,

**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 05 పెన్ పవర్.** ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఆదివాసి ఉద్యోగులకు ప్రశంస పత్రాలు,అవార్డులు అందించాలి.రొబ్బా లోవరాజు
రాష్ట్ర అధ్యక్షులు
ట్రైబల్ రైట్స్ ఫోరం (టి.ఆర్.ఎఫ్)ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఆగస్టు 9న జరుపుకుంటున్న సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న ఆదివాసి ఉద్యోగులందరికీ గుర్తింపు ఇవ్వాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బా లోవరాజు కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సమాజ అభివృద్ధిలో,పరిపాలనలో ఆదివాసి ఉద్యోగులు చేస్తున్న సేవలు అమూల్యమైనవని అన్నారు.క్షేత్రస్థాయిలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి,ప్రభుత్వ పథకాల అమలుకు వారు అందిస్తున్న కృషిని గుర్తిస్తూ,ప్రతి శాఖలో ఉత్తమంగా పనిచేసిన ఆదివాసి ఉద్యోగులను ఎంపిక చేసి ప్రశంస పత్రాలు,అవార్డులతో సత్కరించాలని ప్రభుత్వాన్ని,సంబంధిత అధికారులను విజ్ఞప్తి




చేస్తున్నానన్నారు."ఆదివాసి సంస్కృతి,సంప్రదాయాల పరిరక్షణతో పాటు,ఉద్యోగాల్లో ఉన్న మన వారిని ప్రోత్సహించడం ద్వారా రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.ఆగస్టు 9న జరిగే అధికారిక కార్యక్రమాల్లో ఈ అవార్డుల ప్రదానం చేర్చాలి"అని రోబ్బా లోవరాజు తెలిపారు.

## దింసా నృత్యాన్ని దుష్ప్రచారం చేసిన వారిపై ఖండించిన ప్రభుత్వ విప్.



**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 05 పెన్ పవర్.** భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంలో 13 వేల మంది గిరిజన విద్యార్థినులు ప్రదర్శించిన ధింసా నృత్యం గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం యావత్ ఆంధ్రప్రదేశ్‌కే గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు.ధింసా నృత్యంపై కొందరు చేస్తున్న విమర్శలు,దుష్ప్రచారాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు.ధింసా అనేది గిరిజనుల ఆత్మగౌరవానికి,సంస్కృతికి,సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు.అల్లూరి సీతారామరాజు పేరు అంతర్జాతీయ విమానాశ్రయానికి పెట్టినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ గిరిజన బాలికలు తమ సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారని తెలిపారు.పండుగలు,పెళ్లిళ్లు,శుభకార్యాలు వంటి ప్రతి ఆనంద సందర్భంలో ధింసా నృత్యం చేయడం గిరిజనుల సంప్రదాయమని,అలాంటి సంస్కృతిని రాజకీయ కోణంలో చూడటం దురదృష్టకరమని అన్నారు.గిరిజన సంస్కృతిపై సరైన అవగాహన లేకుండా తప్పుడు వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు.గిరిజన బాలికల ప్రతిభను ప్రశంసించాల్సిన సమయంలో వారిని అవమానించేలా మాట్లాడటం సమంజసం కాదని, ముఖ్యంగా మాజీ ఐఏఎస్ అధికారి పి.వి.రమేష్ వంటి అనుభవజ్ఞులు కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మరింత విచారకరమని అన్నారు.యావత్ భారతదేశం గిరిజన బాలికల ప్రతిభను అభినందిస్తుంటే కొందరు విమర్శలు చేయడం సరైన వైఖరి కాదన్నారు.ధింసాను అవమానించడం అంటే గిరిజన సంస్కృతిని,గిరిజనుల ఆత్మగౌరవాన్ని అవమానించినట్లేనని స్పష్టం చేశారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త అధ్యాయమని, ఒకప్పుడు"ఎర్ర బస్సు కూడా రాదు"అని చెప్పిన ప్రాంతానికి అంతర్జాతీయ విమానాశ్రయం తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వానికి గిరిజన సమాజం కృతజ్ఞతలు తెలియజేస్తోందని చెప్పారు.గిరిజన పిల్లల ప్రతిభను రాజకీయ విమర్శలకు బలిచేయవద్దని,గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి డిమాండ్ చేశారు.అనంతరం ధింసా నృత్యంపై తప్పుడు కథనాలు ప్రచురించిందని ఆరోపిస్తూ,పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గిరిజన సంస్కృతిని కించపరిచే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# గిరిజన సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయి పరిశీలన

**అరకు, హుకుంపేట, పాడేరులో శాసనసభ గిరిజన సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ విస్తృత పర్యటన**



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/ గూడెం కొత్తవీధి,ఆగస్టు 5:** గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్న అంశంపై ఆంధ్రప్రదేశ్ శాసనసభ గిరిజన సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి బుధవారం విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. అరకు వ్యాలీ, డుంబ్రిగూడ, హుకుంపేట, పాడేరు మండలాల్లోని పలు విద్యా, వైద్య, సంక్షేమ సంస్థలను సందర్శించి విద్యార్థులు, అధికారులు, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.అరకు వ్యాలీ మండలం ఎండపల్లివలసలోని ఏపీఆర్‌జేసీ బాలికల పాఠశాల, అరకు ఏపీఆర్‌జేసీ జూనియర్ కళాశాలను సందర్శించారు. పాఠశాలలో వంటశాల, భోజన వసతి, మెనూను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన, వసతి సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. బాల్య వివాహాలు, గంజా వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు.డుంబ్రిగూడ మండలం కిల్లోగూడ, జైపూర్ జంక్షన్‌లోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థులకు అందుతున్న విద్య, సంక్షేమ సౌకర్యాలపై పిల్లలతో మాట్లాడారు. పాఠాలు అర్థం కాకపోతే ఉపాధ్యాయులను ఒకటికి రెండుసార్లు అడిగి తెలుసుకుని చదువుకోవాలని సూచించారు.హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రోజువారీ ఓపీ వివరాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతను పరిశీలించారు. చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యాబోధన, భోజనం, వసతి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.పాడేరు పీఎంఆర్‌సీలో గిరిజన సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాప్రతినిధుల నుంచి ఛైర్‌పర్సన్ వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం పాడేరు మండలం గుడివాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. చిన్నారుల నెలవారీ ఆరోగ్య పరీక్షలు, బరువు నమోదు, టీకాల వివరాలను తల్లులను అడిగి తెలుసుకున్నారు. పాడేరు వీడీవీకే వనవికాస్ కేంద్రాన్ని సందర్శించి అడ్డాకులతో విస్తరాకుల తయారీ ప్రక్రియను పరిశీలించారు. వనవిహార్ కేంద్రంలోని గ్రూపు సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ పర్యటనలో అరకు ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు రేగం మత్సలింగం, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పీబీకే పరిమళ, గురుకులం ఓఎస్‌డీ మూర్తి, పీడీ డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాంపడాల్, అదనపు డీఎంహెచ్ఓ బాలమురళీకృష్ణ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రతాప్, పాడేరు ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ డేవిడ్‌రాజ్, అరకు ఈఈ వేణుగోపాల్, పాడేరు ఏఈ దుర్గాప్రసాద్‌తో పాటు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖ తీరానికి సజీవ పర్యావరణ కవచం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 05 :** విశాఖపట్నం తీర ప్రాంతంలో సజీవ పర్యావరణ కవచం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సహకరించాలని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం సాగర్‌నగర్ బీచ్‌లో గ్రీన్ క్లైమేట్ టీమ్ వాలంటీర్లు, రోటరీ కపుల్స్ సభ్యులు, కల్కి భగవాన్ భక్తులు, అటవీ శాఖ అధికారులతో కలిసి తాటి పళ్లను నాటిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'గ్రేట్ గ్రీన్ బ్యారియర్' కార్యక్రమంలో భాగంగా తాటి పళ్లను నాటుతున్నట్లు ఆయన తెలిపారు. గతంలోనూ వివిధ తీర ప్రాంతాల్లో గ్రీన్ క్లైమేట్ టీమ్ ఆధ్వ ర్యంలో తాటి పళ్లను నాటినట్లు వెల్లడించారు. 2015 నుంచి 2018 వరకు హెచ్‌పీసీఎల్ కాలనీ పరిసర ప్రాంతాల నుంచి తాటి పళ్లను సేకరించి సాగర్‌నగర్ తీర ప్రాంతంలో నాటినట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం అటవీ శాఖ సహకారంతో వివిధ స్వ చ్ఛంద సంస్థలు, విద్యార్థుల భాగస్వామ్యంతో తీర ప్రాంత మంతా తాటి పళ్లను నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహి స్తున్నామని తెలిపారు. తుఫాన్ల సమయంలో గాలుల వేగాన్ని తగ్గించడంలో రక్షణ వనాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరిం చారు. తాటి పళ్లు అందుబాటులో ఉన్న వారు వాటి వివరా లను వాట్సాప్ ద్వారా 8333849955 నంబర్‌కు పంపించా లని కోరారు.
అటవీ శాఖ విశాఖ సబ్ డీఎఫ్‌వో కడలి శ్రీవాణి మాట్లాడు తూ, తీర ప్రాంతాల్లో ఉప్పునీటి ప్రభావాన్ని తట్టుకుని పెరిగే మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. మారుతున్న వాతావ రణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తీర ప్రాంత పరిరక్షణ కోసం వివిధ రకాల మొక్కలు, విత్తనాలను అటవీ శాఖ నాటుతోందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి సహకరించాలని ఆమె కోరారు.



ఈ కార్యక్రమంలో రోటరీ కపుల్స్ ప్రతినిధి సుధా, కంకటాల శిల్ప, బీనా గ్రంధి, రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్--201 చైర్‌పర్స న్ పువ్వాడ ప్రసన్న శివాని, సభ్యులు సభ, ప్రేమ, కల్కి ఆర్మీ సేవకులు, యాక్షన్ ఎయిడ్ ప్రతినిధి ఐ. కృష్ణకుమారి, అటవీ శాఖ రేంజర్ రాము తదితరులు పాల్గొన్నారు.

# జాయింట్ కలెక్టర్ తిరుమాని పూజ ఆకస్మిక తనిఖీ

**జి.మాదుగుల ఎంపీపీ సిహెచ్ స్కూల్ పాఠశాల తనిఖీ**

**జి.మాడుగుల పెన్ పవర్ ఆగస్ట్(5)** అల్లూరి జిల్లా, జీ.మాడుగుల మండలంలోని సీఏహెచ్ బాలుర ఉన్నత పాఠశాల, బంధవీధి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను జిల్లా జాయింట్ కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడారు.

తనిఖీలోని భాగంగా విద్యాబోధన ఆరోగ్యం, విద్యార్థుల చదువు తీరుపై, వారి ఆరోగ్య పరిస్థితులపై స్వయంగా పిల్లలను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడకుండా నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.

ఉపాధ్యాయుల సమయపాలన, పాఠశాల పనితీరు, అర్థమయ్యే రీతిలో విద్యా బోధన, ఉపాధ్యాయులు సమయానికి వస్తున్నారా లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఫేషియల్ అటెండెన్స్ పరిశీలన అనంతరం ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించి ఫేషియల్ అటెండెన్స్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పిల్లకు రగ్గులు, బుక్స్ అందించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.






## పెదలవాసింగి గ్రామపంచాయతీ ప్రజల దాహార్తి తీర్చిన అప్ హోల్డ్ స్వచ్ఛంద సంస్థ




**జి.మాడుగుల పెన్ పవర్ ఆగస్ట్ (5)** మండలం పెదలువ్వాసింగి గ్రామ పంచాయతీ పరిధిలో గల చుట్టుగుమ్మి నందు అప్ హోల్డ్ స్వచ్ఛంద సంస్థ, శ్రీకాకుళం వారి సహకారంతో ఈరోజు మంచినీటి బోరు కొట్టడం జరిగింది. త్రాగునీటి సదుపాయాలు లేనటువంటి ప్రతి గిరిజన గ్రామానికి త్రాగునీటి సదుపాయం కల్పించాలనేది ఈ సంస్థ ముఖ్య లక్ష్యం ఇందులో భాగంగా తీవ్ర త్రాగునీటి సమస్య ఉన్నటువంటి చుట్టుగుమ్మి గ్రామంలో మంచినీటి కొరకు ఈ బోర్వెల్ అనేది కొట్టడం జరిగింది. అప్ హోల్డ్ చేపట్టిన ఈ బోర్వెల్ ప్రాజెక్ట్ కు అదనంగా పెదలువ్వాసింగి గ్రామ పంచాయతీ నుండి మ్యాచింగ్ నిధుల ద్వారా మోటార్, వాటర్ ట్యాంక్ నిర్మించి త్రాగు నీరు ప్రతి ఇంటికి అందడం ద్వారా పూర్తిగా పరిష్కారం అవుతుందని గ్రామస్తులు ఆనందం మరియు ఆశాభావం వ్యక్తం చేశారు. చైర్మన్ ఫిలిప్ తిమోతి మాటల్లో”నీరు అనేది ప్రతి మనిషికి ప్రాథమిక హక్కు ఈ ప్రాజెక్ట్ ద్వారా ఒక గ్రామం మాత్రమే కాదు, వారి భవిష్యత్తుకూ ఆశను అందించగలిగాం. అప్ హోల్డ్ ఎప్పటికీ సమాజంలోని అట్టడుగు వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంటుంది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అప్ హోల్డ్ సంస్థకు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో అప్ హోల్డ్ ప్రాజెక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ కరుణ కుమార్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, అకౌంటెంట్ రాజేష్, సిబ్బంది జగన్, పెదలువ్వాసింగి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిని కే.బాలచంద్రమణి దేవి, వీుజ గబ్బడి సన్యాసి దొర, గ్రామ పంచాయతీ మాజీ సర్పంచులు కొండపల్లి సత్యనారాయణ, చిట్టిబాబు మరియు గ్రామ పెద్దలు వంచంగి కొండబాబు, ఇతెంగి సన్యాసయ్య, ాజుూా సభ్యులు కొండబాబు, బాలకృష్ణ, పంచాయతీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ చుట్టుగుమ్మి గ్రామ యువత మరియు మహిళలు, పిల్లలు మరియు గ్రామస్తులు అందరూ పాల్గొన్నారు.

## పాలమామిడి వనబంగిపాడు గ్రామంలో పర్యటించన మాజీ సర్పంచ్ రామకృష్ణ



**జి.మడుగుల పెన్ పవర్ ఆగస్ట్ (5)** గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు కారణంగా గ్రామంలో ఉన్నటువంటి పాఠశాల భవనం కూలిపోవడం జరిగింది గతంలో గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీ దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, బిల్డింగ్ మంజూరు చేస్తామని అప్పట్లో గ్రీవెన్స్ లో చెప్పడం జరిగింది కానీ ఇప్పటివరకు ఆ యొక్క జిపిఎస్ పాఠశాల భవనం మంజూరు కావడం లేదు, అధికారులు గ్రామాల్లో వచ్చి చుట్టం చూపుగా వచ్చి వెళుతున్నారు తప్ప, ఒకటో తరగతి నుండి మూడో తరగతి వరకు 41మంది విద్యార్థులు చదువుకుంటున్నారు, కానీ ఇప్పటివరకు ఆ యొక్క గ్రామం స్కూల్ బిల్డింగ్ అనేది మంజూరు చేయడం జరగలేదు కానీ గ్రామస్తులు చేసుకున్నటువంటి, పూరి గుడిసెలోని, ఉపాధ్యాయులు చదువులు చెప్పడం జరుగుతుంది, కావున అధికారులు స్పందించి మా స్కూల్ బిల్డింగ్ మంజూరు చేసి తక్షణం పూర్తి చేస్తారని గ్రామస్తులు మరియు విద్యార్థులు వేడుకుంటున్నారు

# ఆహార నాణ్యతలో లోపాలు ఉపేక్షించం.

- విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు.
- చింతపల్లిలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి ఆకస్మిక తనిఖీలు.

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 5.** గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని, నాణ్యతా లోపాలుంటే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి అధికారులను హెచ్చరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి, జి.కె.వీధి, కొయ్యూరు మండలాల్లో బుధవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా చింతపల్లి మండలంలోని ప్రభుత్వ హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు జీసీసీ డిపోలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాసంస్థలు, అంగన్వాడీల్లో పిల్లలకు వండి పెడుతున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రోజూ భోజనం పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలో సరుకుల నిల్వలు, పంపిణీ తీరును పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. విద్యార్థులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన ఆహార నియమావళి



ప్రకారం కచ్చితంగా నాణ్యమైన పౌష్టికాహారాన్ని మాత్రమే అందించాలని స్పష్టం చేశారు. వారి ఆరోగ్యం విషయంలో ఎటువంటి రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం తాజంగిలో నిర్మాణ దశలో ఉన్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను ఆమె పరిశీలించారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ త్రివేణి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి, సీడీపీఓ, మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) తదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆగస్టు 7న విశాఖలో మెగా జాబ్ మేళా



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 05 :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిం చేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం (టెక్నికల్ అండ్ క్లరికల్), నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఆగస్టు 7వ తేదీన మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి తెలిపారు.

కంచరపాలెంలోని గర్ల్స్ ఐటీఐ క్యాంపస్లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయ సముదాయంలో ఉదయం 10 గంటల నుంచి ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

టీసీఐ, ఇన్నోవ్ సోర్స్ (ఎస్బీఐ కార్డ్స్), నవతా రోడ్ ట్రాన్స్పోర్ట్, అపోలో ఫార్మసీ, ఫ్లిప్కార్ట్ అండ్ డీమార్ట్, ఫాక్స్కాన్, గ్లోరీ వెండర్ టెలికాలర్స్, శుభగృహ, వరుణ్ మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపిటోరియా తదితర సంస్థలు జాబ్ మేళాలో పాల్గొననున్నాయి. అసిస్టెంట్ సూపర్వైజర్, సేల్స్ మేనేజర్, క్యాషియర్, లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్, ఫార్మసిస్ట్, టెలికాలర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఐఫోన్ అసెంబ్లింగ్ ఆపరేటర్, జూనియర్ కెమిస్ట్, ప్రొడక్షన్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలకు నియామకాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇతర విద్యార్హతలు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, పాస్పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

ఈ జాబ్ మేళా ద్వారా యువతకు మెరుగైన వేతనాలతో పాటు కెరీర్ అభివృద్ధి అవకాశాలు లభిస్తాయని, జిల్లాలోని నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం 9160888066 నంబర్ను సంప్రదించాలని సూచించారు.

# క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం.

**బూత్ కమిటీలను పటిష్టం.**

**బీజేపీ మండల సమావేశంలో నాయకుల పిలుపు**

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 5.** క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల నిర్మాణం ద్వారా భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. చింతపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ మండల బాడీ సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాడేరు అసెంబ్లీ ఇన్ఛార్జి సల్లా రామకృష్ణ, రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యదర్శి పెనుమాక రవికుమార్ హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. సంస్థాగత బలోపేతంలో భాగంగా ప్రతి బూత్ పరిధిలో కమిటీలను ఏర్పాటు చేసి, అట్టడుగు స్థాయి నుంచి పార్టీ పునాదులను గట్టిపరచాలని సూచించారు. రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అంకితభావంతో కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు లకే స్వాతి, జిల్లా ఐటీ కన్వీనర్ పండ ఈశ్వర్ రావు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకర్ రావు, సీనియర్ నాయకులు బోనంగి బాలయ్య పడాల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అలాగే మండల ప్రధాన కార్యదర్శులు పాడి కిశోర్ కుమార్, మహేష్, మండల కోశాధికారి ఉల్లి రమణతో పాటు వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన పార్టీ పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆగస్టు 8 రాష్ట్ర మన్యం బంద్ను జయప్రదం చేయండి: గిరిజన సంఘం పిలుపు




**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 5:** ఆగస్టు 8న నిర్వహించనున్న రాష్ట్ర మన్యం బంద్ను విజయవంతం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని జగదాంబ సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆదివాసీలకు 100 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జీవో నంబర్--3కు బదులుగా ప్రత్యామ్నాయ జీవోను ప్రభుత్వం వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే 1/70 భూబదలాయింపు నియంత్రణ చట్టాన్ని పరిరక్షించేలా సుప్రీంకోర్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని కోరారు.

పాడేరు, ముంచంగిపుట్టు మండలాల్లో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించిన గిరిజన నాయకులపై కేసులు నమోదు చేయడాన్ని ఆయన ఖండించారు. నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే జీవో నంబర్--3కు ప్రత్యామ్నాయ జీవో తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని, అయితే ఇప్పటికీ ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా మన్య ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం కమిటీలు, చర్చల పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవమైన ఆగస్టు 9లోపు ఆదివాసీ హక్కుల పరిరక్షణపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆగస్టు 8న జరిగే రాష్ట్ర మన్యం బంద్లో విద్యార్థులు, యువత, మేధావులు, తల్లిదండ్రులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ. అశోక్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కిముడు చిన్నంనాయుడు, జిల్లా కార్యదర్శి జి.వి. రమణమూర్తి, మాజీ అధ్యక్షుడు ఎస్. దామోదర్, సహాయ కార్యదర్శి సి. హెచ్. కోటీబాబు, జిల్లా కమిటీ సభ్యుడు రామారావు తదితరులు పాల్గొని ప్రభుత్వాన్ని తమ డిమాండ్లు వెంటనే అమలు చేయాలని కోరారు.ద

## గుమ్మలక్ష్మీపురం డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు ఆహ్వానం.




**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 05 పెన్ పవర్.** డిగ్రీలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపల్ డీ.రామయ్య తెలిపారు. ఈ మేరకు డి,రామయ్య మాట్లాడుతూ,స్థానిక ప్రభుత్వ పోస్ట్ మెట్రిక్ కళాశాలలో ప్రవేశానికి ఉన్న ఖాళీలు,బీఏ,బీకం,కంప్యూటర్ సైన్స్,బీఎస్సీ బోటనీ మరియు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూపులకు ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. అంతేకాక ఇంటర్,హెచ్ఈసీ,సీఏసీ,ఎంపీసీ,బైపీసీ మరియు ఇంటర్లో వొకేషనల్ గ్రూపులో చదివి,పాసైన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం పొందాలని కోరారు. మా కళాశాలలో నిపుణులైన అధ్యాపకులు,కంప్యూటర్ ల్యాబులు,సైన్స్ ల్యాబులు,కళాశాలలో,విశాలమైన తరగతి గదులు,సౌలభ్యమని అన్నారు. మొదటి విడత కౌన్సిలింగ్లో భాగంగా ఈ నెల 11 వ తారీఖు వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని,ఇప్పటి వరకు ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న వారు,దరఖాస్తు చేసుకోలేని వారు కూడా నేరుగా కళాశాలకు వచ్చి,మేము అందించే ఉచిత రిజిస్ట్రేషన్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,కొన్ని గ్రూపులు సీట్లు పూర్తి కావస్తున్నట్లు తెలియజేశారు. కాబట్టి,త్వరగా వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. మా కళాశాల సెలవు దినాల్లో కూడా సిబ్బంది అందుబాటులో ఉంటారని విద్యార్థి,విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

# తల్లిదండ్రులు--విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం




**కూర్మన్నపాలెం: పెన్ పవర్, ఆగస్టు 5:**విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ లో నూతనంగా ప్రవేశం పొందిన 2వ సంవత్సరం బీటెక్ లేటరల్ ఎంట్రీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల కోసం ప్రత్యేక తల్లిదండ్రులు--విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీన్ అకాడెమిక్స్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీన్ అకాడెమిక్స్ డా. ఎ. నాగజ్యోతి మరియు అకాడెమిక్ కోఆర్డినేటర్ కె. గురుచరణ్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల విద్యా విధానం, అకాడెమిక్ నిబంధనలు, మెంటరింగ్ వ్యవస్థ, క్యాంపస్ సౌకర్యాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన శిక్షణ, ప్లేస్‌మెంట్ అవకాశాలు, పరిశోధన కార్యక్రమాలు, అలాగే విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ సహాయక సేవలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డా. లావు రత్తయ్య తన సందేశంలో నూతన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు హృదయపూర్వక స్వాగతం పలికారు. విద్య అనేది కేవలం విజ్ఞానాన్ని అందించడమే కాకుండా క్రమశిక్షణ, విలువలు, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, వినూత్న ఆలోచనలను పెంపొందించే ప్రక్రియ అని పేర్కొన్నారు. కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించడంతో పాటు, వారి విద్యాభ్యాసంలో తల్లిదండ్రులు నిరంతరం ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదనరావు, అడ్మిషన్స్ డీన్ డా. కె. మధుసూదనరావు, మూల్యాంకన విభాగం డీన్ డా. బి. సతీష్, ప్లేస్‌మెంట్స్ డీన్ డా. బి. ప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, క్రమశిక్షణ, క్రమబద్ధమైన హాజరు, నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకోవడంతో పాటు సాంకేతిక, వృత్తిపరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విజయవంతమైన కెరీర్‌ను నిర్మించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, డిప్యూటీ విభాగాధిపతులు, అధ్యాపకులు, నూతన లేటరల్ ఎంట్రీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నిర్వహించిన పరస్పర చర్చలో తల్లిదండ్రులు కళాశాల విద్యార్థి కేంద్రిత విద్యా విధానం, పటిష్టమైన అకాడెమిక్ వ్యవస్థ, నాణ్యమైన విద్య పట్ల సంస్థ చూపుతున్న నిబద్ధతను అభినందిస్తూ తమ సంతృప్తిని వ్యక్తం చేశారు.

# 66వ వార్డులో తల్లిపాల వారోత్సవాలు



**గాజువాక: పెన్ పవర్, ఆగస్టు 05**:జీవీఎంసీ 66వ వార్డులో కనితి రోడ్డు ఇందిరా కాలనీ నందు గల అంగన్వాడి స్కూల్ నందు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆగస్టు ఒకటో తేదీ నుండి ఏడవ తేదీ వరకు జరుగు తల్లిపాల వారోత్సవాలు తల్లిపాలతో బిడ్డకు రక్ష అనే కార్యక్రమం వాసవ్య మహిళా మండలి విప్రో కేర్ కుషాల్ మెటర్నిటీ మెంటల్ హెల్త్ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి స్కూల్ నందు జరుగు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 66వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ , మాజీ కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్, జనసేన వార్డు అధ్యక్షుడు పోలారవుతూ వెంకటరమణ వార్డు అధ్యక్షులు గోమాడ వాసు మరియు అంగన్వాడీ సిడిపిఓ నేలవేణి , ఇందిరా కాలనీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ దివ్య గౌతమి కుశల్, ప్రాజెక్టు ఉష పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మహమ్మద్ రఫీ గారు మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు అత్యంత సురక్షితం శిశువుకు సంపూర్ణ పౌష్టికాహారం బిడ్డకు ముఖ్యంగా తల్లిపాలు ఇవ్వాలి అందువల్ల బిడ్డకు కావలసిన అన్ని పోషకాలు విటమిన్స్ మినరల్స్ ప్రోటీన్స్ లభిస్తాయని పసిపిల్లలకు అవి ఎంతో శ్రేష్టమైన మని తల్లిపాలు తాగితే పిల్లలు ఎంత బరువు ఉండాలో అంతే ఉంటారు అధిక బరువు అసలు బరువు లేకపోవడం వంటి సమస్యలు ఎక్కువగా రావు తల్లిపాలు తాగుతూ పెరిగే పిల్లలకు భవిష్యత్తులో డయాబెటిస్ ఒబెసిటీ సమస్యలు రాకుండా ఉంటాయి అని ప్రతి ఒక్క తల్లి కూడా తమ పిల్లలకు తల్లిపాలు ఇవ్వాలని మంచి ఆరోగ్యంగా పుష్కలంగా ఉండాలంటే పిల్లలకు తల్లిపాలు తప్పకుండా ఇవ్వాలని అన్నారు కూటమి ప్రభుత్వంలో అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టిక ఆహారం లో పోషకాలు విటమిన్స్ మినరల్స్ ప్రోటీన్స్ తల్లులకు పిల్లలకు అందిస్తుందని చెప్పారు ఈ కార్యక్రమంలో బాలింతలు మరియు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు చెరుకూరి నాగేశ్వరరావు గూడెపు సత్యనారాయణ లతా రమణ మరియు అంగన్వాడీ సూపర్వైజర్ చెల్లయ్యమ్మ అంగన్వాడీ టీచర్స్ టీ మంగమ్మ వరలక్ష్మి నాగలక్ష్మి ఏఎన్ఎంలు భవాని రమాదేవి వెంకటలక్ష్మి యూ పి హెచ్ సి స్టాప్ తదితరులు పాల్గొన్నారు

# తల్లిపాలే శిశువుకు తొలి టీకా

## తల్లిపాల వారోత్సవంలో అవగాహన కార్యక్రమం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 5:**తల్లిపాల ప్రాధాన్యంపై తల్లులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు గూడెం కొత్తవీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రింతాడ-1 సచివాలయం, రింతాడ ఉపకేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య సందర్శకురాలు ఎర్రయమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆహారమని వివరించారు. తల్లిపాల ద్వారా శిశువుకు అవసరమైన పోషకాలు అందడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. తల్లి, బిడ్డ మధ్య అనుబంధం మరింత బలపడుతుందని చెప్పారు. బిడ్డకు ముర్రుపాలు సంపూర్ణ ఆహారమని, తల్లిపాలే బిడ్డకు తొలి టీకా అని అవగాహన కల్పించారు.అదేవిధంగా తల్లులకు కూడా తల్లిపాలు ఇవ్వడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ప్రసవానంతరం తల్లి త్వరగా కోలుకోవడానికి సహాయపడటంతో పాటు తల్లి, బిడ్డ మధ్య అనుబంధాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. తల్లుల్లో కొన్ని రకాల క్యాన్సర్లు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యల ముప్పును తగ్గించడంలో తల్లిపాలు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సందర్శకురాలు ఎర్రయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, అంగన్వాడీ సూపర్‌వైజర్ మోహిని, హెల్త్ అసిస్టెంట్ ఎం. సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు యోగిత, పద్మ, అంగన్వాడీ కార్యకర్త రామజ్యోతి, ఆశా కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమం, ప్రతి వీధికి అభివృద్ధి .. బొడ్డు



**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు:05**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు పై ప్రజలకు తెలిసేలా ఇంటింటికి టీడిపి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి తెలిపారు. మండలంలోని లంకూరు సీతానగరం గ్రామాల్లో బుధవారం నాడు టీడిపి క్లస్టర్ ఇంచార్జ్ వలవల రాజా ఆధ్వర్యంలో రాజానగరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్యఅతిథిగా ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాల పంచుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి ప్రత్యక్ష లబ్ధి చేకూరుతోందని తెలిపారు. మహిళా ఉచిత బస్సు ప్రయాణాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారని ఉచిత గ్యాస్ సిలిండర్లు తల్లికి వందనం, పెన్షన్లు 3000 నుంచి రూ.4,000 కు పెంచటం వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను, ప్రజల అవసరాలపై నేరుగా వివరాలు తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గెడ్డం తిమ్మరావు, టిడిపి నాయకులు గద్దె వెంకట కృష్ణ చౌదరి (నళిని), ఘంటా రామకృష్ణ, పెందుర్తి అచ్యుత రామారావు, సంగన చిన పోసియ్య, ఆశ్నన బాబు, ఓబులనేని కృష్ణ చైతన్య, చిట్టూరి రంగారావు, గుర్రం ఉదయ్, దుద్దుపూడి శ్రీనివాస్, షేక్ మీరా షరీఫ్ రాజు, సోషల్ మీడియా పుక్కల శ్రీను వాస్, మండా రాంబాబు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనే లక్ష్యంగా 90'ం కిడ్ సంస్థ మరో ముందడుగు

- కూర్మన్నపాలెంలో ఆధునిక సెలూన్ ప్రారంభం



**గాజువాక :పెన్ పవర్, ఆగస్టు 05:** యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న 90'ం కిడ్ సంస్థ మరో వినూత్న అడుగు వేసింది. గతంలో పాలకొల్లు, తుని ప్రాంతాల్లో విజయవంతంగా రెస్టారెంట్లను ప్రారంభించిన ఈ సంస్థ,ఇటీవల వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తిని అందించాలనే ఉద్దేశంతో బాదం మిల్క్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. తాజాగా కూర్మన్నపాలెం సమీపంలో దువ్వాడ రైల్వే స్టేషన్ కి వెళ్ళే మార్గంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన సెలూన్‌ను ప్రారంభించింది.వైసీపీ ఇంచార్జి తిప్పల దేవన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ బొండా జగన్,వార్డు టీడీపీ అధ్యక్షుడు నల్లూరు సూర్య నారాయణ,కాతా బాలకృష్ణ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ రాజా మాట్లాడుతూ వ్యాపారం ద్వారా లాభాలు పొందడమే కాకుండా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నైపుణ్యం ఉన్న యువతకు శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ,స్వయం ఉపాధికి ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యమైన సేవలు,వినియోగదారుల విశ్వాసమే తమ విజయానికి మూలమని,భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో సేవలను విస్తరించి మరింత మందికి ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

స్థానిక ప్రజలు,వ్యాపారవేత్తలు, శ్రేయోభిలాషులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని సంస్థ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

## ప్రజల గడపకు సంక్షేమం అభివృద్ధి

- ముంచంగిపుట్టు మండలంలో టీడీపీ ఇంటింటికి విస్తృత ప్రచారం.
- మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, కార్యదర్శి కే జగత్రాయ్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 05.**ప్రజల గడపకు సంక్షేమం అభివృద్ధి, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని మండలంలో గల బుంగాపుట్టు, లక్ష్మీపురం, బరడ, పంచాయతీల పలు గ్రామాలలో నిర్వహించినట్లు టిడిపి మండల అధ్యక్షురాలు కే సన్యాసమ్మ కార్యదర్శి కే జగత్రాయ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం వారు తెలిపిన వివరాల ప్రకారం.. గడిచిన రెండేళ్ల కాలంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు మహిళలకు, రైతులకు యువతకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు మరియు హామీల అమలు తీరును ప్రతి కుటుంబానికి తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే స్థానికంగా ఉన్న కొన్ని చిన్నపాటి సమస్యలను అడిగి తెలుసుకుని ఉన్నత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు పార్టీ నాయకులు భరోసా ఇచ్చారు. రానున్న రోజుల్లో మండలంలో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ మాజీ వైస్ ప్రెసిడెంట్ రాణాసింగి నిలకంఠ పాత్రో, సోషల్ మీడియా కన్వీనర్ చెట్టి నవీన్ కుమార్, కిల్లో భగీరది, కొర్ర రామూర్తి, పాంగి కృష్ణ రావు, కిల్లో పరుశురాం, కొర్ర మధు, పాంగి అర్జున్, కిల్లో మన్మధరావు, కొర్ర గంగాధర్, పాంగి జగన్నాధం, పాంగి జగబందు, కొర్ర సీతారాం, పాంగి గోవింద్, రేయ్యాల కృష్ణ, గిర్లీయ దోయితారి, వంతాల అద్దు, రేయ్యాలా ధర్మారావు పద్మనాభం, కొర్ర చిట్టీ సుంక్రి, బుద్ధి, దన్ను, కృష్ణ, సుంక్రి, సురేష్, ధన్న?ర్జయ్, కొమ్ములైచోన్, బాలాభద్ర కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## డ్రోన్లతో 20 వేల విత్తన బంతులు వెదజల్లిన అటవీశాఖ




**గూడెం కొత్త వీధి,సీలేరు, పెన్ పవర్, ఆగస్టు 5:**అటవీ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు సహజ వనరుల పరిరక్షణకు అటవీశాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బుధవారం సీలేరు అటవీ రేంజ్ పరిధిలో డ్రోన్ల సహాయంతో విత్తన బంతులను వెదజల్లే కార్యక్రమాన్ని అటవీశాఖ అధికారులు నిర్వహించారు.సీలేరు అటవీ రేంజ్ పరిధిలోని ధర్మాపురం, నిమ్మలగొంది, తోకరాయి, బంధవీధి, కొమ్ములవాడ పరిసర అటవీ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా సుమారు 20 వేల విత్తన బంతులను వెదజల్లారు. ఈ సందర్భంగా సీలేరు అటవీ రేంజ్ అధికారి ఎస్. వెంకటరావు మాట్లాడుతూ.. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీలేరు రేంజ్ పరిధిలో మొత్తం 1.20 లక్షల విత్తన బంతులను తయారు చేసి వెదజల్లే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జాఫ్రా, చింత, నేరేడు, రావి, మర్రి, కానుగ, తురకవేప తదితర వృక్ష జాతుల విత్తనాలతో విత్తన బంతులను తయారు చేసినట్లు వివరించారు.గత జూలైలో సీలేరు రేంజ్ పరిధిలోని వివిధ అటవీ ప్రాంతాలతో పాటు రైతుల పొలాల్లో సిబ్బంది, ప్రజల సహకారంతో లక్ష విత్తన బంతులను విజయవంతంగా వెదజల్లినట్లు తెలిపారు. మిగిలిన 20 వేల విత్తన బంతులను ఎత్తైన కొండ ప్రాంతాలకు సులభంగా చేరవేసేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నట్లు రేంజ్ అధికారి తెలిపారు.అటవీ పునరుజ్జీవనం, పచ్చదనం పెంపు లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సీలేరు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com